# ఎన్నెన్నో రాగాలు

27.08.2022 మోహనకళ్యాణి

మోహనకళ్యాణి రాగం సంగీత త్రిమూర్తుల తరువాతి కాలంలో కనుగొనబడిన రాగం. ముత్తయ్య భాగవతార్ ఈ రాగం సృష్టికర్త. మోహన, కళ్యాణి రాగాల మేళవింపే మోహనకళ్యాణి. మోహనలో 5-5 స్వరాలుంటాయి. (బాలమురళికృష్ణ జోక్ చేసేవారు. మోహనలో 'మ-నీ' ఉండదని). నిజమే మధ్యమ, నిషాద స్వరాలుండవు. కళ్యాణి సంపూర్ణ రాగం (7-7). మోహన ఆరోహణలోని 5 స్వరాలు, కళ్యాణి అవరోహణలోని 7 స్వరాలు తీసుకొని మోహనకళ్యాణి (5-7 ఔడవ-సంపూర్ణం) రాగం రూపొందించారు. కళ్యాణికి జన్యరాగంగా పరిగణిస్తారు. హిందుస్థానీలో 'శుద్ధకళ్యాణ్' (రసిక్ బల్మా హిందీ పాటకు ఆధారం) మోహనకళ్యాణికి తుల్యరాగం (equivalent). శాస్త్రీయ సంగీతంలో చక్కని శ్రావ్యమైన రాగంగా కొన్ని సంగతులలో మన మనస్సులను ఎక్కడికో తీసుకొని వెళ్లిపోతుంది, ముఖ్యంగా లాల్గుడి జయరామన్ తిల్లానా వింటుంటే. ఇక ఈ రాగంలో చలనచిత్ర గీతాల విషయం. మోహన రాగం చలనచిత్ర సంగీత దర్శకుల పాలిట కల్పవృక్షం. చక్కని ఫలితాలు ఇస్తుంది. ఈ రాగంలో పాటలు ఎక్కువ. అందువల్ల వైవిధ్యం చూపించడం కోసం సంగీత దర్శకులు చేసిన ఎన్నో ప్రయోగాలకు గురైంది. రాగంలో చెప్పబడని 'మ' 'ని' లే కాదు 'గ' 'ధ' లలో కూడా మార్పులు చేస్తూ పోయారు. మోహన సినిమా పాటలలో హంసధ్వనిని స్ఫురింపచేసేవి, కళ్యాణిని స్ఫురింపచేసేవి, ఇలా రకరకాలుగా కనబడుతుంటాయి. చివరికి విశ్లేషకులు కూడా ఘంటసాల గారి మోహన, రాజేశ్వరరావు గారి మోహన, పెండ్యాల వారి మోహన అని వ్యవహరిస్తారు. ఈ నేపథ్యంలో మోహనలో చిన్న మార్పుతో నిర్ధారించుకోవలసిన మోహనకళ్యాణిలో స్పష్టంగా చెప్పగలిగిన సినిమా పాటలు చాలా అరుదుగానే కనిపిస్తాయి.

28.08.2022 కర్ణరంజని

'కర్ణరంజని' - చెవులకు హాయినిచ్చేది - పేరే ఈరాగం మాధుర్య భరితం అన్న భావాన్ని కలుగచేస్తుంది. అసలు సంగీతం శ్రవ్య ప్రధానమైన కళ. ఇక్కడ పని అంతా చెవులదే! 'వీనులవిందు' అనే కదా అంటారు. సంగీతం వినడానికి మరీ హాయిగా ఉంటే కళ్లు వాటంతట అవే మూతలు పడిపోతాయి. అంటే సంగీతంలో మాధుర్యం పెరిగితే కళ్లకు పని తగ్గుతుంది. కానీ ఈనాటి ఛానల్స్ లో 'కన్నులపండుగ' గా ఉంటేనే మంచి సంగీతం అంటున్నారు

నిన్నటి మోహనకళ్యాణి రాగం వలెనే కర్ణరంజని కూడా హరికేశనల్లూర్ ముత్తయ్య భాగవతార్ కనుగొన్నరాగమే. ఇంకా విజయనాగరి, విజయసరస్వతి వంటి రాగాలకూ ఆయనే ఆద్యులు. కర్ణరంజని 22వ మేళకర్త (సంపూర్ణ) రాగమైన ఖరహరప్రియ జన్యం. ఆరోహణలో 6 స్వరాలతో వక్ర సంచారం కలిగి అవరోహణలో సంపూర్ణముగా ఉంటుంది. కొన్ని

ఇతర రచనలు ఉన్నా ఈ రాగం పేరు చెప్పగానే గుర్తు వచ్చేది 'వాంచ తోను నా వగలు తెల్పవే అంబా' అనే ముత్తయ్య భాగవతార్ కీర్తనే

సినిమా సంగీతం విషయానికి వస్తే తెలుగులో ఇలాంటి rare రాగాలలో పాటలు ఉండే అవకాశం చాలా స్వల్పం.  మన సంగీత దర్శకులు పాపులర్ రాగాలకే పరిమితమయ్యారు.  ఇలాంటి సందర్భాలలో తమిళ మలయాళ దర్శకుల ప్రయోగశీలతే ఆ రాగాలను కొంతవరకు సంగీత ప్రియులకు అందుబాటులో ఉంచుతుంది

సభ్యులొకరు కర్ణరంజని రాగం వినిపించమని అడిగారు.  కానీ చలనచిత్ర గీతాలు ఆ రాగంలో ఉండే అవకాశం లేదనిపించిందేమో మళ్లీ ఆ మెస్సేజ్ తీసేశారు. అయినా ఇంత మధురమైన రాగం ఏదో ఒకలా వినిపించాలనిపించింది. రాగం పేరు సూచించిన ఆ సోదరికి ధన్యవాదాలు.

29.08.2022  శివరంజని

శివరంజని రాగంతో తెలియకుండానే మనకున్న అనుబంధం ఆకాశవాణి సిగ్నేచర్ ట్యూన్ ఆ రాగంలో ఉండడం. శివరంజని రాగం హిందుస్తానీ సంగీతం నుండి కర్ణాటక సంగీతంలోనికి తీసుకొని రాబడినది.  కాఫీ (హిందుస్తానీ) థాట్ కి చెందిన రాగం. ఆరోహణలోనూ అవరోహణలోనూ ఐదు స్వరాలే ఉంటాయి. ఈ రాగం మోహన రాగానికి స్వరనిర్మాణం దృష్ట్యా చాలా దగ్గరగా ఉంటుంది. మోహన రాగంలోని తీవ్ర గాంధారం బదులు కోమల గాంధారం వాడితే శివరంజని అవుతుంది. శివరంజనిలో నిషిద్ధ స్వరాలైన మధ్యమం, నిషాదం వాడితే దాన్ని మిశ్ర శివరంజని అంటారు. కర్ణాటక రాగం రంజనితో కొంచెం పోలిక ఉన్నా శివరంజనితో పోలిస్తే  రంజనిలో ఆర్ద్రత తక్కువ.  రంజని గంభీరమైన భావ ప్రకటనకు బాగుంటుంది. హరికేశనల్లూర్ ముత్తయ్య భాగవతార్ సృష్టించిన కర్ణాటక రాగం విజయనాగరి శివరంజనికి సన్నిహిత రాగంగా చెప్పవచ్చు.

30.08.2022  ఝుంఝూటి

'ఝుంఝు' అనగా పెద్ద వానతో కూడిన హోరు గాలి కాగా అంతటి తీవ్రత ఈరాగం వింటుంటే అనుభవానికి రాదు. హిందుస్తానీ లో కూడా ఇదే పేరుతో పిలువబడుతున్నా తమిళులు 'సెంజరుట్టి'గా ఎక్కువ పిలుస్తారు. హిందుస్తానీ సంగీతంలో కచేరీలలో ఒక ముఖ్య రాగంగా తీసుకోవడం అలాగే హిందీ చిత్రాల్లో మంచి పాటలు (సంఖ్యలో తక్కువ అయినా) రూపొందించడం జరుగుతుంది. కర్ణాటక సంగీత ప్రదర్శనలలో చివరి అంశాల్లో మాత్రమే చూస్తాము. ఒక మంచి జావళి, ప్రసిద్ధమైన ఒక తిల్లానా, 'రాముడు ద్భవించినాడు...' వంటి కొన్ని భక్తి సంగీత అంశాల్లో వింటాము. ముత్తుస్వామి దీక్షితుల వారి షోడశ (16) గణపతి కీర్తనలలో ఒకటి ఈ రాగంలో ఉండడం విశేషం.28వ మేళకర్త రాగం

'హరికాంభోజి' కి జన్యరాగం. వక్ర సంచారంతో స్వరములు అమరి వుంటాయి. చలనచిత్ర గీతాలు కూడా చాలా తక్కువ. తెలుగులో 'దేవదేవ ధవళాచల' (భూకైలాస్) ఒక్కటే పూర్తి నిడివి పాట అని నా అభిప్రాయం.

01.09.2022 శుభపంతువరాళి

సభ్యులు ఒక సోదరి 'తోడి (హిందుస్తానీ) ' లో ఉన్న కొన్ని గీతాలు వినిపించమని కోరారు. ఆ రాగాన్ని కర్ణాటక సంప్రదాయంలో 'శుభపంతువరాళి' (45వ మేళకర్త) గా వ్యవహరిస్తారు.

'తోడి' పేరుతో రెండు సంప్రదాయాలలో ఉన్న రాగాలు ఒకటి కాదు. రెండూ కరుణ రసాత్మకమైన రాగాలే. రెండూ జనక (parent) రాగాలే. { 'జనకరాగాలు' కర్ణాటక సంగీతంలో మేళకర్తలు గా పిలువబడ్డాయి. వాటి సంఖ్య 72. హిందుస్తానీ లో థాట్ (THAAT) గా పిలుస్తారు. అవి 10. మనం వినే ఏ రాగమైనా ఏదో ఒక మేళకర్త/ థాట్ నుండి జనించినదే అవుతుంది}

కర్ణాటక తోడి (8వ మేళకర్త) కర్ణాటక సాంప్రదాయంలో అతి ముఖ్యమైనది. బోధనా పరంగా మిగతా రాగాల కంటే ప్రత్యేకమైనది. చెప్పాలంటే indispensable for any music student. ఆశ్చర్యకరంగా సినిమా సంగీతానికి ఈ రాగం చేసే దోహదం దాదాపు శూన్యం.

సరే, హిందుస్తానీ తోడి విషయానికి వస్తే, తోడి థాట్ లోని ప్రధాన రాగాలు మియా(న్) కీ తోడి, గుర్జరీ తోడి. ఇందులో మియా(న్) కీ తోడి నే తోడి గా వ్యవహరించడం అలవాటు. Prefix ఏమీ చెప్పకుండా తోడి అని ఉంటే మనం మియా(న్) కీ తోడి వింటున్నాం అనే భావించాలి. ఇక రెండో తోడి, గుర్జరీ తోడి. స్వల్ప స్వర భేదంతోనే రెండు రాగాలు ఉంటాయి. ఇంకా చెప్పాలంటే ఆ స్వల్ప భేదం శాస్త్రీయ సంగీతంలో పెద్ద విషయం కాని సినిమా సంగీతంలో పరిగణనకు తీసుకోవాల్సినంత విషయం కాదు.

కర్ణాటక సంగీతంలో పై రెండు తోడి (మియా(న్) కీ తోడి, గుర్జరీ తోడి) లనూ 'శుభ పంతువరాళి' గానే వ్యవహరిస్తారు. కానీ దాక్షిణాత్య సినిమా సంగీత దర్శకులు మియా(న్) కీ తోడిని మాత్రం శుభపంతువరాళి గా, గుర్జరీతోడి ని 'గుర్జరి' లేక గుజ్జరి అని పిలుస్తున్నారు. ఇదొక సందిగ్ధతకు దారి తీస్తుంది. ఎందుకంటే కర్ణాటక సంగీతంలో గుర్జరి పేరుతో ఒక పూర్వ రాగం ఉంది. అందులో త్యాగరాజ కీర్తన 'వరాలందుకొమ్మని' అనే ప్రసిద్ధం కూడా.

02.09.2022 ఖమాస్

ఖమాస్ రాగం 28వ మేళకర్త అయిన హరికాంభోజికి జన్యరాగం. శృంగార రసోద్దీపకమైన రాగం. త్యాగరాజు, ఇతర వాగ్గేయకారుల కీర్తనలు చాలా ఉన్నా మైసూర్ వాసుదేవాచార్ రచించిన 'బ్రోచేవారెవరురా' కీర్తనకు ఎంతో ప్రాచుర్యం లభించింది. ఆయన ఆ కీర్తనలో చేసిన అంతకు ఖమాస్ లేని ప్రయోగం అటు తర్వాత ఆ రాగంలో స్థిరపడిపోయింది. ఇలా ఒక కీర్తనలో స్వరకర్త కానీ అనంతర గాయకులు కానీ రాగంలో తెచ్చిన మార్పులు స్థిరపడి కాలగతిలో ఆ రాగం

స్వరూపాన్ని మార్చిన ఉదాహరణలు కొన్ని ఉన్నాయి కూడా నగుమోము (అభేరి), జగదోద్ధారణ (కాపీ) వంటివి. చక్కని జావళీలకు ఖమాస్ ప్రసిద్ధం.

చలనచిత్ర సంగీతంలో కూడా తన ఉనికిని చాటుకున్నది. భానుమతికి కళ్యాణి తరువాత అభిమానమైన రాగమేమోనని ఆమె పాటలను గమనిస్తే అనిపిస్తుంది. సాలూరి రాజేశ్వరరావు గారు కూడా మంచి పాటలు అందించారు.

హిందుస్తానీ సంగీతంలో కూడా ఇదే పేరుతో పిలుస్తారు. తెలుగులో ఎక్కువ సోలో గీతాలు ఉంటే హిందీలో మంచి యుగళ గీతాలు ఉన్నాయీ రాగంలో

03.09.2022 ఆరభి

'ఆరభి' కర్ణాటక సంగీతంలో 29వ మేళకర్త శంకరాభరణం యొక్క జన్యరాగం. భక్తిభావ ప్రకటన, దైవస్తుతి, మంగళప్రద సన్నివేశాలకు యుక్తమైన రాగం. ఆరభి రాగంతో సంగీత కచేరి ప్రారంభించడం ఒక సంప్రదాయం. అందుకేనేమో, పౌరాణిక చిత్రాల్లో రాగమాలికలుగా కూర్చబడిన దండకాలు, రాగమాలికలుగా ఆరభి రాగంతోనే మొదలౌతాయి. ఆరభి రాగంలో ఉన్నన్ని దండకాలు ఏ ఇతర రాగంలోనూ కన్పించవు. శుద్ధసావేరి, సామరాగాలు ఆరభి కి స్వల్పమార్పులతో ఏర్పడే రాగాలు. అందువల్ల ఈ 3 రాగాల్లోని లలిత/ సినిమా సంగీత రచనలు ఏ రాగం ఆధారితమో ఊహించడం కొంచెం కష్టం. ఆరభికి హిందుస్తానీలో పోలిన రాగం లేదు. వాగ్గేయకారులందరూ రచనలు చేశారు. త్యాగరాజ స్వామైతే 14 కీర్తనలు రచించారు. వాటిలో 'సాధించెనే...' పంచరత్నకీర్తనలలో ఒకటి. చలనచిత్ర గీతాల్లో సాంఘిక నేపథ్యం ఉన్న పాటలకు అంతగా అనువైన రాగం కాదు.

04.09.2022 వలజి

'వలజి' ఉదయకాలాలలో పాడదగిన రాగం. ప్రత్యూష పవనాలలో తేలి వచ్చే ఈ రాగ స్వరాలను వింటుంటే మనసు నిర్మలమై ఒక రకమైన ప్రశాంతత చేకూరుతుంది. అందుకే భక్తి గీతాలనూ, ప్రణయగీతాలను కూడా ఈ రాగంలో స్వరపరచుతారు.

వలజి రాగంలో అయిదే స్వరాలుంటాయి. 16వ మేళకర్తయిన చక్రవాక రాగమునుండి జన్యము. చక్రవాకంలో ఒక స్వరం (మ) తగ్గితే 'మలయమారుతం', మరొక స్వరం (రి) తగ్గితే 'వలజి' ఏర్పడతాయి. హిందూస్థానీలో సమానమైన రాగం 'కళావతి'. (కర్ణాటక సంగీతంలోని మరొక రాగం కళావతికి ఈ జంట రాగాలు వలజి - కళావతిలకూ ఏ పోలికా లేదు)

కర్ణాటక సంగీతంలో వలజి రాగంలో కీర్తనలు తక్కువ సంఖ్యలోనే కనబడతాయి. త్యాగరాజు ఈరాగంలో రచన చేయలేదు. సినిమా సంగీతంలో వలజిలో పాటలు ప్రత్యేకంగా ఉండి శ్రోతల ఆదరణ పాత్రములైనాయి. రమేష్ నాయుడు ఈ రాగంలో దేవుడు చేసిన మనుషులు చిత్రంలో 'విన్నారా అలనాటి వేణుగానం..' పాట మధురంగా చేయడమే కాదు, ఆ సన్నివేశంలో పాట ప్రారంభానికి ముందు వినిపించిన బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ లో వినిపించిన 'వలజి' అందాలు విని తీరవలసినదే! హిందీ చిత్రాల్లో చాలా మంచి పాటలు 'కళావతి' లో ఉన్నాయి. ఒక అన్యస్వరం కలిపితే రూపొందించిన 'జనసమ్మోహిని' రాగం కూడా హిందీ చిత్రాల్లో వాడుతారు

05.09.2022 చక్రవాకం

చక్రవాకం రాగం కర్ణాటక సాంప్రదాయ సంగీతంలోని 16వ మేళకర్త. హిందూస్తానీ సంగీతంలో  చక్రవాకం రాగానికి దగ్గర రాగం అహిర్భైరవ్ కరుణ, భక్తి రసాలను ఈ రాగాలు బాగా పోషిస్తాయి. ఈ కీర్తనలలో 'పిబరే రామరసం రసనే...' సదాశివ బ్రహ్మేంద్ర కీర్తన బాలమురళీకృష్ణ అహీర్ భైరవ్ లో పాడేవారు. అది బాగా ప్రాచుర్యం పొంది  అందరూ అదే రాగంలో పాడుతున్నారు. పూర్వ తమిళ విద్వాంసులు యమునాకళ్యాణి రాగంలో పాడేవారు. ఇప్పుడు కూడా అదే రాగంలో పాడే విద్వాంసులు ఉన్నారు. సంగీత త్రిమూర్తుల కాలానికి ముందు వాగ్గేయకారుల రచనల్లో ముఖ్యంగా సదాశివ బ్రహ్మేంద్ర, నారాయణ తీర్థుల కీర్తనల విషయంలో ఈ సందిగ్ధత ఎదురౌతుంది. అన్నమాచార్య కీర్తనలలో కొన్నింటిలో కూడా.

06.09.2022 జయజయవంతి

జయజయవంతి హిందుస్తానీ రాగం. జైజైవంతి అని కూడా పిలుస్తారు. ఖమాస్ థాట్ కు చెందిన రాగం. పేరులో ఉన్నట్లు ఈ రాగం వింటుంటే ఒక విజయ దరహాసం మన ఊహ లోనికి వస్తుంది. కర్ణాటక సాంప్రదాయంలోని ద్విజావంతి రాగం,

జయజయవంతికి సమాన రాగం. 28వ మేళకర్త హరికాంభోజికి జన్యరాగం. హరికాంభోజి కర్ణాటక సంగీతంలో అతి ఎక్కువ జన్యరాగాలు కలిగిన మేళకర్త రాగం. ద్విజావంతి 6 స్వరాలు (ని ఉండదు) కలిగి అవరోహణలో వక్ర సంచారంతో ఉంటుంది. దీక్షితార్ ఈ రాగాన్ని జుజావంతి అని వ్యవహరించారు. లలిత, సినిమా సంగీతాలలో జయజయవంతి గానే పిలుస్తారు. హిందుస్తానీ సంగీతం ప్రదర్శనలలో ఒక ముఖ్యమైన రాగంగా ఉంటుంది.

07.09.2022 బృందావన సారంగ

బృందావన సారంగ రాగం 22వ మేళకర్త రాగం అయిన ఖరహరప్రియ జన్యం.  బృందావని, బృందావన సారంగ రెండు పేర్లు మనం వింటుంటాం. ఈ రెండూ ఒకటేనా లేక వేర్వేరు రాగాలా అనే విషయం గురించి కొంత వివాదం ఉంది.

సప్తస్వరాలు ఏడింటిలో 5 స్వరాలు (స, ప కాక మిగిలినవి) స్వల్ప శ్రుతి భేదంతో రెండేసి స్వర స్థానాలుగా పలుకుతాయి. ఆవిధంగా రెండు 'ని' స్వర స్థానాలు ఉంటాయి. వాటిలో ఏ 'ని' స్వరం (నిషాదం) ఉపయోగించాలీ అనే ఆ వివాదం. హిందుస్తానీలో ఈ రాగాన్ని బృందావనీ సారంగ్ గా పిలుస్తారు. కాఫీ థాట్ కు చెందిన రాగం. నిజానికి ఈ రాగాన్ని సారంగ్ గా పిలిచేవారు. స్వామి హరిదాస్ ఈ రాగంలో కృష్ణునిపై పలు రచనలు రచించడం పాడడం వలన మధుర, బృందావన ప్రాంతీయులు బృందావనీ సారంగగా వ్యవహరిస్తూ వచ్చారు. ఈ రాగం శృంగారరస ప్రధానమైన రచనలకు ఎక్కువ ఉపయోగిస్తారు.

08.09.2022 బాగేశ్వరి

బాగేశ్వరి ఒక హిందుస్తానీ శాస్త్రీయ రాగం. కాఫీ థాట్ లోనిది. బాగేశ్రీ, వాగేశ్వరి, భాగేశ్వరి మొదలైన చాలా పేర్లతో కూడా పిలవబడుతుంది. హిందుస్తానీ సంప్రదాయంలో ప్రతి రాగం పాడడానికి రోజులో ఒక సమయం నిర్దేశించబడుతుంది. ఈ రాగం అర్ధరాత్రి పాడవలసిన ఒక ప్రసిద్ధ రాగం. ఒక ప్రేమికురాలు తన ప్రేమికుడితో తిరిగి కలవడానికి వేచి ఉన్న భావోద్వేగాన్ని బాగేశ్వరి రాగం వర్ణిస్తుంది. ఇది మొదటిసారి పదహారవ శతాబ్దంలో అక్బర్ చక్రవర్తి కొలువులో ప్రసిద్ధ గాయకుడు తాన్సేన్ పాడినట్లు చెప్పబడింది. ఇరవయ్యవ శతాబ్దంలో, బాగేశ్రి రాగం కర్ణాటక సంగీతంలో విస్తృతంగా ప్రజాదరణ పొందింది. 22వ మేళకర్త ఖరహరప్రియ జన్యం. ఆరోహణలో 5, అవరోహణలో 6 స్వరాలు కలిగియుంటుంది. రాగేశ్వరి (రాగేశ్రీ) అనే సన్నిహిత రాగం కూడా ఉన్నది. ఆ రాగం ఘంటసాల గారికి అత్యంత ప్రియమైనదిగా చెప్తారు. పూర్వ వాగ్గేయకారుల రచనలేవీ బాగేశ్వరిలో లేవు. ఇది సాధారణంగా వృత్తముల్లో, పదాలలో, భజనల్లో, రాగమాలికల్లో, ప్రధాన కీర్తన పాడేసిన తర్వాత కచేరీలలో పాడతారు.

09.09.2022 మలయమారుతం

మలయమారుతం 'మ' (మధ్యమం) లేని ఒక షాడవ రాగం. 16వ మేళకర్త 'చక్రవాకం' యొక్క జన్యరాగం. ఈ రాగ లక్షణం ప్రకృతి రామణీయకత. ఉదయాన్నే పాడుకొనే ఆహ్లాదకరమైన రాగంగా విద్వాంసులు కీర్తనలు రచించారు. "మనసా ఎటులోర్తునే.." అన్న త్యాగరాజ కృతి చాలా ప్రశిద్ధం. కరుణ రసాన్ని ఎంతో చక్కగా పోషించే "మలయ మారుతం" రాగం తెలుగు సినిమా పాటల్లో తక్కువే అనిపిస్తుంది అడపా తడపా రాగమాలికల్లో ఈ రాగాన్ని వాడుతుంటారు. సన్నిహిత రాగమైన 'వలజి'లో ఎక్కువ చిత్ర గీతాలు ఉంటాయి. హిందుస్తానీలో ఈపేరు గల రాగం కానీ, పోలిన రాగం కానీ లేవు. హిందీ చలనచిత్రాల్లో ఈ రాగ ఆధారితం అని చెప్పబడుతున్న గీతాలు లేవు.

10.09.2022 మధ్యమావతి

మధ్యమావతి కర్ణాటక సంగీతంలో 22వ మేళకర్త ఖరహరప్రియ యొక్క జన్యరాగము. గ (గాంధారం), ధ (ధైవతం) కాక మిగతా 5 స్వరాలు కలిగియుంటుంది. ఖరహరప్రియ జన్యమే అయిన శ్రీరాగము ఆరోహణలో ఇదే స్వరాలను కలిగియుండి మధ్యమావతికి అత్యంత సన్నిహిత రాగంగా మనకు వినిపిస్తుంది. మధ్యమావతి రాగం ప్రకృతికి చాలా దగ్గరగా ఉండే రాగం. రైతులు సేద్యం చేస్తూ పాడుకొనే జానపదగీతాలలో ఈ రాగం ఎక్కువ కనపడుతుంది. కచేరీలలో మంగళం పాడి చిట్టచివరి సంగతి మధ్యమావతిలో పాడి కచేరీ ముగిస్తారు. అలాగే రాగమాలికలుగా రూపొందించినబడిన పాటలు, స్తవాలూ, స్తోత్రాలలో చివరి రాగంగా మధ్యమావతిని ఎంచుకుంటారు. మరొక విషయం. సంగీతంపై పెద్దగా పట్టులేని రంగస్థల నటులు, హరికథా విద్వాంసులు వంటివారు అవసరార్థం ఈ రాగం తీసుకుని ఏదోలా కృతకృత్యులవుతూ ఉంటారు. నాటకాలు, సినిమాలలో పద్యాలకు కూడా భావప్రకటనకు ప్రత్యేకంగా వాడబడే కేదారగౌళ, బిలహరి, మోహనల సరసన నిలిచే రాగం. ఈ రాగం హిందుస్తానీలో మధుమాధ్ సారంగ్ కి దగ్గరగా ఉంటుంది. ఆ రాగానికి వారి సంగీతంలోని మేఘ్, మేఘమల్హర్ సన్నిహిత రాగాలు. మేఘాలు ముసిరేటివేళ ఈ రాగాలు వినటానికి, పాడుకొనటానికి చాలా బాగుంటాయి.

11.09.2022 మాండ్

మాండ్ 29వ మేళకర్త శంకరాభరణం యొక్క జన్యరాగం. రాజస్థానీ జానపద సంగీతం నుండి ఉద్భవించిందని భావిస్తారు. ప్రేమను, వాంఛను వ్యక్తపరచటానికి అనువైన రాగం. ఇది ఉత్తర భారతదేశంలో ప్రసిద్ధి చెందింది. దక్షిణాన మాత్రం కచేరీలలో చివరి అంశాలకు, రాగమాలికలలోనూ వాడబడుతుంది. ఈ రాగంలోని స్వరాల అమరిక ఎగుడు దిగుడుగా ఉండడం వలన వేరే సంగీత ధోరణులలోని సంగతులను మిశ్రమం చేసే అవకాశం సంగీత దర్శకులకు లభిస్తుంది. అందువల్ల మనం వినే మాండ్ రాగం ఎక్కువ సందర్భాలలో 'మిశ్ర' మాండే కావడం జరుగుతుంది. సినిమా సంగీతంలో అయితే మరీ ఎక్కువగా. మాండ్ లో హిందీ చలనచిత్ర పాటలు సమృద్ధిగా ఉన్నాయి. ఉత్తరాది జానపదులతో పెనవేసుకుపోయినది మాండ్రాగం. ఎన్నో శ్రావ్యమైన గీతాలే కాదు, మరెన్నో మన చెవిన బడనివి కూడా ఉంటాయి

12.09.2022 శుద్ధధన్యాసి

ఈరోజు శుద్ధ ధన్యాసి రాగంలో స్వరపరిచిన కొన్ని గీతాలు విందాం. ఐదు స్వరాలను కలిగి ఉన్న రాగాలు సాధారణంగా చాలా అనుకూలమైనవి మరియు ఆకర్షణీయంగా ఉంటాయి (ఉదాహరణ: మోహన, హిందోళ, హంసధ్వని). శుద్ధధన్యాసి కూడా రి (రిషభం), ధ (ధైవతం) లేకుండా మిగిలిన 5 స్వరాలు కలిగిన సౌష్టవ (symmetric) రాగం. 22వ మేళకర్త రాగం ఖరహరప్రియ యొక్క జన్య రాగం. ని (నిషాదం) విషయంలో స్వల్ప స్వరభేదం ఉన్నప్పటికీ

ఉదయరవిచంద్రిక రాగాన్ని శుద్ధధన్యాసి రాగానికి సమానమైన రాగం గానే భావిస్తారు. అభేరి రాగం శుద్ధధన్యాసి యొక్క ఆరోహణ స్వరాల్ని, ఖరహరప్రియ యొక్క అవరోహణ స్వరాల్ని కలిగి ఉన్న రాగం. శాస్త్రీయ సంగీతంలో రాగం యొక్క స్వరాల్ని నిర్దుష్టంగానే ఉంచుతూ పాడతారు కాబట్టి అభేరి, శుద్ధధన్యాసిలను గుర్తించడంలో శ్రోత సందిగ్ధతకు లోను కాడు. కానీ సినిమా సంగీతంలో మాత్రం ఈ రెండు రాగాల మధ్య పొరపాటు పడడం ఎక్కువ సందర్భాలలో జరుగుతూ ఉంటుంది. హిందుస్తానీ సంగీతంలో శుద్ధధన్యాసికు సమానమైన రాగం పేరు ధానీ. ఆ రాగంలో చాలా తక్కువ పాటలే చేయబడ్డాయి.

13.09.2022 కీరవాణి

కీరవాణి కర్ణాటక సంగీతంలో 21వ మేళకర్త రాగం. మేళకర్త రాగాలన్నీ సంపూర్ణ రాగాలు. ఆరోహణ, అవరోహణలలో 7 స్వరాలనూ కలిగి ఉంటాయి. కీరవాణిలోని 'మ' (మధ్యమం) శుద్ధ మధ్యమం. ఆ స్వరం స్థానంలో మరో మధ్యమం అయిన ప్రతి మధ్యమం వాడితే అది మరో ప్రసిద్ధ రాగం 'సింహేద్ర మధ్యమం' అవుతుంది. (ఏ ఒక్క స్వరం మారినా రాగం మరో రాగంగా మారిపోతుంది. కానీ మధ్యమంలోని 2 స్వర స్థానాల మార్పు దృష్ట్యా చేసే వర్గీకరణ సంగీత శాస్త్ర అధ్యయనానికి మూలమైనదిగా భావించబడుతుంది). ముత్తుస్వామి దీక్షితార్ విధానంలో ఈ రాగం 'కిరణావళి' గా పిలువబడుతుంది. ఈ రాగం పాశ్చాత్య సంగీతంలో కూడా ప్రసిద్ధి చెందినది. వారి పరిభాషలో 'హార్మోనిక్ మైనర్ స్కేల్' కు సమానమైనది. కర్ణాటక సంగీతం నుండి హిందుస్థానీ సంగీతంలోకి తీసుకోబడింది. రెండు సంప్రదాయాలలోనూ ఇదే పేరుతో పిలువబడుతూ శాస్త్రీయ సంగీత ప్రదర్శనలలో ఒక ముఖ్య రాగంగా విలసిల్లుతోంది. చలనచిత్ర సంగీతంలో కూడా సముచిత స్థానం కలదు.

14.09.2022 నీలాంబరి

నీలాంబరి రాగం 29వ మేళకర్త శంకరాభరణం నుండి రూపొందించబడినది. ఆరోహణలో 7, అవరోహణలో 6 (ధైవతం లేకుండా) తీసుకుంటూ రెండింటా వక్ర సంచారం కలిగిన రాగం. స్వరములు కంపితంగా (ఎక్కువ గమకంతో) వాడబడడమే ఈరాగంలోని ప్రత్యేకత. ఆ లక్షణం కళాకారుడు చూపలేకపోతే శంకరాభరణం, నీలాంబరి ఒకేలా శ్రోతకు అనిపిస్తాయి. నీలాంబరి రాగంలో మనోధర్మం పోషించడం కష్టమైన విషయంగా కళాకారులు భావిస్తారు. ఎక్కువగా వాడే ఈ కంపితగమకం వలనే నీలాంబరి లాలిపాటలకు ప్రత్యేకంగా చెప్పబడుతుంది. వివాహ గీతాలు, భక్తి, కరుణ. మరియు వాత్సల్యం, ఓదార్పు వంటి భావాలు చిత్రీకరించే గీతాలకు ఎంతో అనువైన రాగం. త్యాగరాజ స్వామి కీర్తనలలో ఈ భావాలన్నీ మనకు ఇతర వాగ్గేయకారుల రచనలకంటే ఎక్కువ అనుభవానికి రావడానికి మన 'సుందర' తెలుగు కూడా ఒక కారణమేమో! హిందూస్తానీలో నీలాంబరి పేరుతో ఒక రాగం ఉన్నా అది పూర్తిగా భిన్నమైనది. ఇంత

లలితమైన సంగీత సృష్టి చేసి ఎన్నో సున్నితమైన సందర్భాలకు వాడదగిన ఈ రాగాన్ని వినియోగించుకోవడంలో తెలుగు సినిమా సంగీత దర్శకులు ఎంతో వెనుకబడి ఉన్నారు.

15.09.2022 రాగేశ్రీ

నేటి మన రాగం రాగేశ్రీ (రాగేశ్వరిగా కూడా పిలవబడుతుంది) ఒక ప్రత్యేకత కలిగినది. మన అభిమాన గాయకుడు ఘంటసాల వారి సినీ సంగీత జీవితంలో ఈ రాగంతో అనుబంధం ఒక మైలురాయిగా నిలిచిపోయింది. ఘంటసాల, ఆయన సమకాలీన సంగీత దర్శకుల గురించి ఆలోచన చేస్తే వారిలో కొందరు దాక్షిణాత్య సంగీతంలో ప్రావీణ్యం కలవారు కాగా, కొందరు హిందీ చిత్ర సంగీతంలో కొంత అనుభవం సంపాదించి వచ్చినవారు. ఆరంభంలో ఘంటసాల గారు మొదటికోవకు చెందినవారే. 1948 ప్రాంతాల్లో ఉస్తాద్ బడే గులాం ఆలీఖాన్ తో పరిచయం ఘంటసాలకు హిందుస్తానీ సంగీతంలో మెళుకువలు తెలుసుకొనడానికి దోహదం చేసింది. సంగీత దర్శకునిగా తను చేసే ప్రయోగాల తీరుని మార్చి, లాలిత్యానికి, మాధుర్యానికి కొత్త రాగాలతో బాణీలను కట్టడం ఆరంభమైంది. అందులో రాగేశ్రీ పై ప్రత్యేకమైన అభిమానం, అవగాహన కలిగాయి. ఈ రాగం ఆయనకు చాలా ప్రియమైనదిగా మనకు తెలుస్తుంది. ప్రథమంగా రాగేశ్రీ రాగాన్ని తెలుగు సినిమాలలో వినిపించినది ఘంటసాలే అనవచ్చు. స్వీయ సంగీత దర్శకత్వం వహించిన చిత్రాలలో రాగేశ్రీ విహారం వినిపిస్తుంది. ఘంటసాల పలుచోట్ల రాగేశ్రీలో లేని పంచమాన్ని ప్రయోగించారు. 1950-1970 ఘంటసాల రాగేశ్రీ రాగాధారితమైన ఎన్నో బాణీలను కట్టారు. అవి "ఎంతఘాటు ప్రేమయో" (1951 - పాతాళభైరవి), "ఇది నాచెలి" (1953 - చంద్రహారం), "అన్నానా భామిని" (1957 - సారంగధర), "చమకు చమకు తార" (1959 - పెళ్ళిసందడి), "ఊయలలూగీ నా హృదయం" (1960 - అభిమానం), "ఈ మరపేల ఈ వెరపేల" (1960- భక్త రఘునాథ్) "రాగాలా సరాగాల" (1960 - శాంతినివాసం), "మగరాయా" (1967 - రహస్యం). సమకాలీనులైన సంగీతదర్శకులు సైతమూ ఈ రాగ ఛాయను అందుకొని బాణీలను కట్టారు. ఉదాహరణకు: "నీ నీడలోన" (సువర్ణ సుందరి), "ఆడేపాడే పసివాడ" (పెళ్ళికానుక), సిగలోకి విరులిచ్చి (సుమంగళి), "కన్నుల్లో నీ బొమ్మ చూడు" పాటలో 'పున్నమ వన్నెలలో'" అనే చరణం (విమల), మరియు "మందర మాటలు విని మౌఢ్యమ్మున కైకేయి" (కలసివుంటే కలదు సుఖం).

ఇక రాగం గురించిన శాస్త్రీయ వివరాలలోనికి వస్తే రాగేశ్రీ ఖమాస్ థాట్ కు చెందిన రాగం. ఆరోహణలో 5 (రిషభం, పంచమం లేకుండా), అవరోహణలో 6 (పంచమం లేకుండా) స్వరాలు కలిగి ఉంటుంది. సాధారణ గాంధారం స్థానంలో కోమల గాంధార స్వర ప్రయోగంతో రాగేశ్రీ రాగం బాగేశ్వరిగా మారిపోతుంది. కొంతవరకు నాటకురంజి రాగానికి రాగేశ్రీ

దగ్గరగా ఉంటుంది. శాస్త్రీయ సంగీత రంగం / చలనచిత్ర సంగీతాలలో రాగేశ్రీ రాగం ఉపయోగించబడడం పరిశీలిస్తే కొంత ఆసక్తికరంగా ఉంటుంది. హిందుస్తానీ కచేరీలలో ఒక ఆకర్షణీయమైన రాగం కాగా కర్ణాటక సంగీత ప్రదర్శనలలో లాల్గుడి జయరామన్ తిల్లానా తప్ప మరో రచనే కనపడదు. సినిమా సంగీతం చూస్తే హిందీలో చెప్పుకోతగ్గ మంచి పాటలు లేవు. కొద్ది సోలో సాంగ్స్ మాత్రమే దొరుకుతున్నాయి. అదే తెలుగులో చూస్తే పాత సినిమాలలో సంఖ్యాపరంగా తక్కువైనా ఆణిముత్యాల వంటివి ఉన్నాయి.

16.09.2022 చారుకేశి

చారుకేశి రాగం కర్ణాటక సంగీతం నుండి హిందుస్థాని విద్వాంసులు స్వీకరించిన రాగాలలో ప్రముఖమైనది. కర్ణాటక సంగీతం లోని 72 మేళకర్త రాగాల వ్యవస్థలో 26వ మేళకర్త రాగము (సంపూర్ణ రాగం). చారుకేశి ప్రేమ, దైవభక్తి మరియు అభ్యర్థనలను ఉత్తమంగా వ్యక్తీకరిస్తుంది. శృంగార భక్తి రసాలను మిళితం చేస్తుంది. అన్ని వయసుల, అభిరుచుల శ్రోతలకు అత్యంత ఇష్టమైనది. శాస్త్రీయ సంగీతంలో, ఈ రాగం చాలా విస్తృతంగా ఉపయోగించబడలేదు. అయితే, త్యాగరాజు ఈ రాగానికి 'ఆడమోడి గలదే' కృతిలో ఇచ్చిన గుర్తింపు ఈరాగం విశిష్టతకు ప్రబల సాక్ష్యంగా నిలుస్తుంది. స్వాతి తిరునాళ్ రచించిన 'కృపయా పాలయా శౌరే' చారుకేశి రాగంలో ప్రాచుర్యం పొందిన కృతులలో మరొకటి. ముత్తుస్వామి దీక్షితులు ఈ రాగాన్ని "తరంగిణి" అని వ్యవహరించారు. చలనచిత్ర సంగీతంలో, ఈ రాగం ప్రతిష్ఠాత్మకమైన స్థానాన్ని ఆక్రమించింది.

17.09.2022 రేవతి

రేవతి కర్ణాటక సంగీతంలో ప్రత్యేకత కలిగిన ఒక రాగం. సంగీత త్రిమూర్తులు కాని అనంతర కాలంలోని పేరెన్నిక గన్న వాగ్గేయకారులు కానీ ఈ రాగంలో రచనలు చేయలేదు. ఇప్పటికీ ఎక్కువ సంగీత రచనలు లేకపోయినా ఉన్న కీర్తనలూ లలిత, చలనచిత్ర గీతాలు విశేష ఆదరణ పొందడం గమనార్హం. ఇది ఒక ఔడవ (5-5 స్వరాలు గల) రాగం. రత్నాంగి రాగం యొక్క జన్యరాగంగా పరిగణిస్తారు. కరుణ రసావిష్కరణకు అనువైన రాగం. వైదిక మంత్రోచ్చాటనానికి కూడా ఈ రాగం ఉపయోగించబడుతుంది.

హిందూస్తానీ సంగీతంలో రేవతిని పోలిన రాగం బైరాగి లేదా బైరాగి భైరవ్ గా చెప్పబడుతున్నది. రెండూ ఒకటేనా లేక వేర్వేరు రాగాలా అన్న విషయంలో భిన్న అభిప్రాయాలున్నాయి. సిక్కుమత గ్రంథం 'గురుగ్రంథ సాహెబ్' లో కూడా వాడబడినంతటి పురాతనమైనది బైరాగి రాగం కాగా 1949లో పండిట్ రవిశంకర్ కొన్ని మార్పులతో బైరాగి భైరవ్ రూపొందించారని ఇప్పుడు వాడుకలో ఉన్నది అదేనని తెలుస్తోంది. హిందుస్తానీ సంప్రదాయం ప్రకారం బైరాగి రాగం ఉదయం 6-9 గంటల మధ్య పాడబడే రాగం.

అన్నమాచార్య సంకీర్తన నానాటి బదుకు నాటకము రేవతి రాగంలో శ్రీ నేదునూరి కృష్ణమూర్తి గారు స్వరపరచడం శ్రీమతి ఎమ్మెస్ సుబ్బులక్ష్మి గారి గళంలో విశేష ప్రజాదరణకు పాత్రం కావడం ఈ రాగం ప్రజలకు చేరువకావడానికి ముఖ్య కారణం అనడం అతిశయోక్తి కాదేమో!

18.09.2022 శుద్ధసావేరి

**శుద్ధసావేరి శంకరాభరణ జన్యమైన రాగం. ఆరోహణ ఐదు అవరోహణంలో ఆరు స్వరాలు ఉండడం వల్ల దీనిని ఔడవ - షాడవ (5-6) రాగం అంటారు. ఆరభిలో 'ని' ని వదలితే, సామరాగం. 'ని' తో పాటు 'గ' నూ తొలగిస్తే, అనగా నిషాద, గాంధార వర్జితమైతే అపుడు ఆరభి శుద్ధసావేరి గా మారుతుంది. శాంత రస ప్రధానమైన రాగం. శాంతి సౌరభాలని పెంపొందించి, ప్రశాంతతని కలిగిస్తుంది. అన్ని వేళలా పాడదగిన రాగం. కాని సాయంత్రం వేళ, రాత్రి వేళ అనుకూలము. ముత్తుస్వామి దీక్షితార్ వారి విధానం ప్రకారం, ఈ రాగాన్ని దేవక్రియ అంటారు.**

**హిందూస్థాని సంగీతంలో దుర్గ రాగం శుద్ధ సావేరి నుండి ఉద్భవించిందని చెప్పబడుతుంది. ఇది సాధ్యమే, ఎందుకంటే ఉత్తర భారతీయులు దక్షిణాది నుండి రాగాలను "అరువు" తీసుకోవడం చాలా సాధారణం. కానీ అలాంటి సందర్భాలలో, వారు సాధారణంగా వాటి దక్షిణ భారత పేర్లనే ఉంచుతారు (ఉదా., చారుకేశి, హంసధ్వని). అందుకు భిన్నంగా దుర్గ అనే అంబ లేదా పార్వతి దేవత పేరు ఉంచారు. ఈ రాగం బిలావల్ థాట్కు చెందినది. సాంప్రదాయకంగా సాయంత్రం నుండి అర్ధరాత్రి వరకు పాడబడుతుంది. దుర్గ రాగంలో ప్రదర్శించడం మరియు కంపోజ్ చేయడం చాలా సులభం.**

**21.09.2022** ఖరహరప్రియ

ఖరహరప్రియ కర్ణాటక సంగీతంలో 22వ మేళకర్త రాగం (సంపూర్ణం). హిందుస్థానీ సంగీతంలోని కాఫీ థాట్ రాగం దీనికి సమానమైనది. ఈ రాగంలో అనేకమైన జన్య రాగాలు ఉన్నాయి. వాటిలో కొన్ని ఆభేరి, అభోగి, బృందావన సారంగ, కాపీ, మధ్యమావతి, ముఖారి, రీతిగౌళ, శ్రీ, ఉదయరవిచంద్రిక, శివరంజని, శ్రీరంజని. అన్నింటిలో 'కాపీ' చాలా ముఖ్యమైనదిగా భావించబడుతుంది.

రాగం సాధారణంగా నెమ్మదిగా పాడబడుతుంది. రాగంలో అనేక ప్రయోగాలకు అవకాశం ఉన్నందున, విస్తృతమైన ప్రదర్శనలకు చాలా అనుకూలంగా ఉంటుంది. ఈ రాగంలో స్వరపరిచినవారు సంగీత త్రిమూర్తులలో త్యాగరాజు ఒక్కరే; అత్యంత ప్రసిద్ధమైన 'పక్కల నిలబడి', 'రామ నీ సమానమెవరు', 'చక్కని రాజమార్గము' వంటి ఈ రాగంలోని కీర్తనలు త్యాగరాజ విరచితములే.

కర్ణాటక సంగీత కచేరీలలో ప్రధాన అంశంగా తీసుకోబడే రాగాల్లో ఖరహరప్రియ ఒకటి. సినిమా సంగీతంలో ఈ రాగం వాడడం చాలా తక్కువ. వాడిన ఆ కొద్ది సందర్భాలలో కూడా ఇంచుమించు శాస్త్రీయ సంగీతంలా అనిపించే పాటలే రూపొందాయి. అంటే ఖరహరప్రియ రాగంలోని స్వరాల నిర్మాణం మామూలు పాటలకు అనుకూలంగా ఉండదని భావించాలి.

**22.09.2022** సామ

సామ రాగం 29వ మేళకర్త రాగమైన శంకరాభరణం రాగం యొక్క జన్యం. ఈ రాగం మనస్సు ప్రశాంతంగా ఉంచడంలో సహాయపడుతుంది. రాగం సాధారణంగా ఎక్కువ క్లిష్టమైన స్వర సంచారాలు లేకుండా సున్నితమైన వేగంతో ప్రదర్శించబడుతుంది. అనుభవజ్ఞులైన విద్వాంసులు సుదీర్ఘ విరామాలు మరియు వైవిధ్యభరితమైన సంగతుల ప్రదర్శన ద్వారా రాగం యొక్క అందం ఇనుమడించి శ్రోతలకు ఈ రాగం ప్రశాంతమైన అనుభూతినిస్తుంది. సదాశివ బ్రహ్మేంద్ర రచన "మానస సంచరరే", త్యాగరాజ కృతి "శాంతము లేక సౌఖ్యము లేదు", దీక్షితుల వారి "అన్నపూర్ణే విశాలాక్షి" ఈ రాగంలోని ప్రసిద్ధ కృతులు. ఈ రాగాన్ని 'శ్యామ' అని కూడా పూర్వం వ్యవహరించేవారు.

ఆరోజుల్లో యావద్దక్షిణ భారతంలోనే ఏ కార్యక్రమమైనాసరే మైకుల్లో మొదట వినిపించే పాట "నమో వేంకటేశా" సామ రాగాధారంగా స్వరాలను విభిన్న రీతిలో ప్రయోగించి మాస్టారు స్వరబరచి పాడిన ఈ పాట ఈనాటికీ జనప్రియమే. కొన్ని చోట్ల ఆరభిలా వినిపించినా సామరాగమనే అనాలి.  ఆరభి మరియు సామ రాగాలలో లేని కొన్ని వరుసలు (మహానందమాయె ఓ మహాదేవదేవా..)

**23.09.2022** చంద్రకౌంస్

చంద్రకౌంస్ 21వ మేళకర్త కీరవాణి జన్యరాగంగా చెప్పబడుతుంది. ఆరోహణ అవరోహణలలో 5 స్వరాలు (రి-రిషభం, ప-పంచమం లేకుండా) గల రాగం. హిందోళ (మాల్కౌంస్) కు అత్యంత సన్నిహిత రాగం. 'ని'(నిషాదం) స్వరం 2 స్థానాలలో పలుకుతుంది. మాల్కౌంస్ లో కోమల 'ని' , చంద్రకౌంస్ లో శుద్ధ 'ని' వాడతారు. కోరిక, సున్నితమైన ప్రేమ, ఒంటరితనం వంటి భావోద్వేగాలను వ్యక్తం చేసే రాగం. శాస్త్రీయ కచేరీలలో హిందుస్థానీ సంప్రదాయంలో కొంచెం విస్తారంగా పాడిన సందర్భాలు కనబడవచ్చు కాని కర్ణాటక సంగీతంలో  చివరి అంశాలకే ఉపయోగించడం చూస్తాము.  లలితసంగీతానికి అనువుగా ఉండే రాగం.

**24.09.2022** హంసనాదం

హంసనాదం కర్ణాటక సంగీత కచేరీలలో ఎక్కువగా పాడబడే రాగాలలో ఒకటి. వింటుంటే చాలా గంభీరమైన భావ ప్రకటన గోచరిస్తుంది. 60వ మేళకర్త రాగం నీతిమతి యొక్క జన్య రాగం. ఔడవ రాగం (5-5).  త్యాగరాజు స్వామి రచించిన 'బంటురీతి కొలువు...' కీర్తన హంసనాదంలో చాలా ప్రసిద్ధి చెందింది.  కచేరీలలో ఎక్కువగా, విస్తారంగా పాడబడే కీర్తన. హిందుస్థానీ రాగాలు శుద్ధ సారంగ్, శ్యామ్ కల్యాణ్ ఈ రాగానికి సన్నిహిత రాగాలు.  ఈమూడు చాలా శ్రావ్యమైన రాగాలు. ఈ రాగాలపై ఆధారపడి ఎన్నో శాస్త్రీయ రచనలు, చలనచిత్ర గీతాలు రూపొందించబడ్డాయి. తమిళ చిత్రాలలో హంసనాదంలో మంచి గీతాలు కనబడతాయి. ఎమ్మెస్ విశ్వనాథన్ ఈ రాగంలో చాలా గీతాలు స్వరపరిచారు.

**25.09.2022** హంసానంది

హంసానంది కర్ణాటక సంప్రదాయంలో 53వ మేళకర్త గమనశ్రమ రాగానికి జన్యరాగం. పంచమం లేకుండా మిగిలిన ఆరు స్వరాలను ఆరోహణ అవరోహణలలో కలిగి ఉంటుంది.   గమనశ్రమ జన్యరాగాలలో అత్యంత ప్రశిద్ధమైనది పూర్వికళ్యాణి. సునాదవినోదిని రాగం శాస్త్ర విషయంగా కళ్యాణి (65వ మేళకర్త) జన్యమైనప్పటికీ హంసానందికి సన్నిహిత రాగం.      సంగీత త్రిమూర్తుల

రచనలలో ఈ రాగంలో ఒక్కటి కూడా లేకపోవడం అలాగే తెలుగులో ఒక్క రచన కూడా లేకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. గంభీరమైన భావప్రకటనకు అనువైన రాగం. స్వరాల కూర్పు ఆధారంగా 72 మేళకర్త రాగాలు మొదటి 36 శుద్ధమధ్యమ రాగాలుగా మిగిలిన 36 ప్రతిమధ్యమ రాగాలుగా వర్గీకరించబడతాయి. శుద్ధమధ్యమ రాగాలు కోమలంగానూ ప్రతిమధ్యమ రాగాలు గంభీరంగానూ వినిపిస్తాయి.

హంసానందికి హిందుస్థానీ సామ్యమైన సోహిని మార్వా థాట్ కు చెందినది. ఆ సంప్రదాయంలో రాగాలు పాడడానికి కాలనియమం నిర్దేశించబడుతుంది. ఆ ప్రకారం వేకువజామునకు ముందు పాడవలసిన రాగం. మార్వా థాట్ లో అత్యంత ప్రాథమిక రాగం మార్వా కూడా హంసానంది - సోహినిలను పోలిన రాగం

సువర్ణసుందరి 1957 లో తెలుగు తమిళ హిందీ భాషలలో నిర్మించబడినది. హాయి హాయిగా ఆమని సాగే పాట రాగమాలికగా నిర్మాత, సంగీత దర్శకులు ఆదినారాయణ రావు స్వరపరచి పల్లవి నుండి మొదటి చరణం వరకు హంసానంది రాగం వాడారు. హిందీ వెర్షన్లో ఆ స్థానంలోని సాహిత్యం కుహూ కుహూ బోలే కోయలియా సోహిని రాగంలో కూర్చారు. అన్ని భాషల ప్రేక్షకులు ఈ రోజుకు కూడా ఈ పాటలను ఆదరిస్తున్నారు. ఆదినారాయణ రావు గారి ఈ గీతాల వల్ల హంసానంది - సోహిని రాగాలకు విశేష ఆదరణ లభించిందని చెప్పవచ్చు

**27.09.2022** హరికాంభోజ

**కర్ణాటక సంప్రదాయంలో హరికాంభోజ (28వ మేళకర్త) రాగానికి శహన జన్యరాగం. ఉభయ వక్రం. అనగా ఆరోహణ అవరోహణలు రెండిటిలోనూ వక్రసంచారం కలిగియుంటుంది. సినిమా సంగీతంలో హరికాంభోజినుండి వచ్చిన జన్యరాగాలు ఎక్కువగా వాడడం జరుగుతుంది. హరికాంభోజి, ఖరహరప్రియ, శంకరాభరణం మేళకర్తల జన్యరాగాలే 90 శాతం సినిమా సంగీతానికి ఆధారమంటే అతిశయోక్తి కాదేమో. శహన రక్తిరాగంగా పేర్కొనబడినది. ఎంతో లాలిత్యం కరుణరసాత్మకత కలిగిన కీర్తనలు కర్ణాటక సంగీతంలో ఈ రాగంలో రచించబడినాయి. త్యాగరాజస్వామి శహనలో చాలా రచనలు చేశారు. వాటిలో 'వందనం రఘునందన' అనే దివ్యనామ సంకీర్తన, 'శ్రీరామ శ్రీరామ శ్రీ మనోహరమా' అనే ఉత్సవ సంప్రదాయ కీర్తన ప్రముఖమైనవి. ఈరాగానికి శాస్త్రీయ సంగీతంలో లభించినంతటి స్థానం చలనచిత్ర సంగీతంలో లభించలేదు. తెలుగు సినిమాలలో పూర్తిగా ఈ రాగంలోనే కూర్చినపాటల సంఖ్య బహుస్వల్పం. 5,6 పాటలే కనబడతాయి. రాగమాలికలలో ఇతర రాగాలతో కలిసి వాడబడిన పాటలు మరి కొన్ని ఉంటాయి.**

**28.09.2022** కానడ

కానడ రాగం 22వ మేళకర్త రాగమైన ఖరహరప్రియకు జన్య రాగం. స్వరాలను షాడవ – వక్ర సంపూర్ణ రాగం. (శాస్త్రీయ సంగీత పరిభాషలో 5 స్వరాలను ఔడవ, 6 స్వరాలను షాడవ, 7 స్వరాలను సంపూర్ణ అని వ్యవహరిస్తారు)

అనగా ఆరోహణలో ప-పంచమం లేకుండా మిగిలిన 6 స్వరాలు, అవరోహణలో 7స్వరాలు (అందు 3 స్వరాలు వక్ర సంచారం చేస్తూ) ఉంటాయి. కానడ చాలా ప్రజాదరణ పొందిన రాగం. గుర్తించడం సులువైన రాగాలలో ఒకటి. ఈ రాగం కరుణ రసాత్మకమైన మానసిక స్థితిని కలిగిస్తుంది. కచేరీలలో తరచుగా రాగమాలికలలో ఉపయోగిస్తారు. ఈ రాగాన్ని కర్ణాటక సంగీతం నుండి 16వ శతాబ్దిలో తాన్సేన్ హిందుస్తానీ శాస్త్రీయ సంగీతంలోకి తీసుకువచ్చారని భావిస్తారు. రాజదర్బార్ లలో విశేషంగా ప్రదర్శించడం

వలన దర్బారీకానడ లేదా దర్బారీగా ఉత్తరాది సంగీతంలో స్థిరపడింది.  హిందుస్తానీ సంగీతంలో, కానడ ఒక రాగాన్ని కాక, రాగాల కుటుంబాన్ని సూచిస్తుంది. మనకు 'కన్నడ' పేరు గల మరొక రాగం ఉంది.  అది శంకరాభరణం నుండి జనించింది. కానడతో కన్నడకు ఏ సారూప్యతా లేదు.  జయభేరి చిత్రంలో ఈ రాగాల పేర్లు వినబడతాయి. నిశితంగా పరిశీలిస్తే సంభాషణలలో ఈ రెండు రాగాల మధ్యా కొంత కన్ఫ్యూజ్ అయ్యారని కూడా గమనించగలం.  ఈ రాగంలో ఎక్కువగా గమకాలు మరియు సూక్ష్మమైన ప్రయోగాలతో గాయకుని ప్రతిభ ద్యోతకం అవుతుంది. కానడ రాగంలో  ఊతుకాడు వెంకట సుబ్బయ్యర్ రచించిన అలై పాయుడే అనే కీర్తన 2000 సంవత్సరంలో వచ్చిన అలై పాయుడే అనే చిత్రంలో సంగీత దర్శకుడు రెహ్మాన్ ఉపయోగించారు.  ఆ పాట విజయవంతం కావడంతో ఈ రాగం గురించి శ్రోతలకు తెలుసునే అవకాశం కలిగింది.

30.09.2022  ధర్మవతి

ధర్మవతి రాగానికి చెందిన పాటల బాణీలలో వింటుంటే ఒక రాగానికి ఇంత శక్తి యెలా వచ్చింది అని మనసులో అనిపిస్తుంది. ఆ రాగంలో పలికే స్వరాలే అందుకు కారణం. రాగలక్షణాలేవిటీ? అని పరిశీలిస్తే —-ఇది 59వ మేళకర్త రాగము. అంటే అన్ని స్వరాలూ వినిపించే సంపూర్ణ రాగం. ఇది ప్రతి మధ్యమ ప్రధానమైన రాగం.  (ఇందులో వినపడే “మ” ని ప్రతిమధ్యమం అంటారు). ఆ ప్రతి మధ్యమం స్థానంలో శుద్ధ మధ్యమం ఉపయోగిస్తే మరో ప్రసిద్ధ రాగం 'గౌరీమనోహరి' గా మారిపోతుంది. ముత్తుస్వామి దీక్షతర్ “పరంధామవతి జయతి”, మైసూర్ వాసుదేవాచారి “భజన సేయరాదా” , బాలమురళీ కృష్ణ   “వశమా నీ అతిశయ మహిమ తెల్ప” , అన్నమయ్య పదాలు “గోవిందా శ్రిత గోకుల బృందా” ,  “మంగాంబుధి హనుమంతా”  ఈ రాగంలో ప్రసిద్ధ రచనలు. త్యాగరాజస్వామి కీర్తన ఏదీ ఈరాగంలో ప్రాచుర్యంలో లేదు. హిందుస్థానీ లో దీనికి సమానమైన రాగం “మధువంతి”. తోడి థాట్ కు చెందిన హిందూస్థానీ రాగం. మధువంతి లో ఆరోహణ లో “రి”,”ద” లు వినపడవు, అవరోహణ లో మళ్లీ అన్ని నోట్సూ వినపడతాయి. శృంగార భావాన్ని తెలిపే రాగంగానూ, భక్తి, ఆర్తి, కరుణ మొదలైన రసాలను పలికించే రాగంగానూ భావిస్తారు.

సినిమా పాటల గురించి చెప్పాలంటే తెలుగు తమిళాల్లో అయినా హిందీలో అయినా చాలా పాటలు వున్నాయి. అయితే ఈ పాటల్లో ధర్మవతి,మధువంతి రాగాల ఛాయలు పెనవేసుకుని వుంటాయి అని గమనించాలి. ముందు తరానికి చెందిన వారయిన సుసర్ల దక్షిణామూర్తి, యం.యస్ విశ్వనాథన్ కూడా ధర్మవతిలో చక్కని పాటలే చేశారు. ఇటీవలి వారిలో ఎక్కువగా ఈ రాగాలని వాడిన వారు ఇళయరాజా, ఎ.ఆర్ రెహమాన్. హిందీ సినిమాలలో చేసిన పాటలలో మధువంతి రాగఛాయలే వినపడతాయి. ధర్మవతి ,మధువంతి రాగాలు చిలికించే మధురమైన మత్తులో  మునిగి హృదయం పరవశమవుతుందనడంలో సందేహంలేదు.

01.10.2022   శంకరాభరణం

శంకరాభరణం రాగము కర్ణాటక సంగీతంలో 29వ మేళకర్త రాగము.   దీనిని ధీరశంకరాభరణం అని కూడా పిలుస్తారు. ఇది 65 వ మేళకర్త రాగమైన మేచకళ్యాణి కి సమానమైన శుద్ధ మధ్యమ రాగము. శంకరాభరణం రాగంలో చాలా జన్య రాగాలు వున్నాయి. వీటిలో కొన్ని ఆరభి, అఠాణా, కురింజి, కేదారం, బిళహరి, దేవగాంధారి, హంసధ్వని, కదనకుతూహలం, శుద్ధ సావేరి.   ప్రేమకు, భక్తికి, ఆధ్యాత్మికతకు , గంభీరానికి, శృంగారానికి అనువైన రాగము. అన్నివేళలా పాడుకోగల రక్తి రాగము. శ్లోకములు, పద్యములు పాడటంతోపాటు రాగాలాపనకు కూడా చాలా అనువైన రాగం .   ఈ రాగానికి అన్ని స్వరాలు మూలస్తంభాలై నిలచి రాగాన్ని రక్తి కట్టిస్తాయి.  ప్రతి రెండో స్వరము ఇందు కంపిత స్వరము.  జంట స్వర, దాటు స్వర ప్రయోగాలు ఈ రాగానికి అందాన్ని చేకూరస్తాయి. హిందుస్థానీ యందు దీని సరిసమానమైన రాగం ‘బిలావల్’.  సిక్కుల పవిత్ర గ్రంథం ‘గురు గంధ్ర

సాహెబ్’లో కూడా ఈ రాగం ప్రస్తావన ఉంది. పాశ్చాత్య సంగీతంలో సి-మేజర్ స్కేల్ దీనికి సమానము. పాశ్చాత్యులు ఈ రాగాన్ని ఎంతగానో అభిమానించారు. జాతీయ గీతం “జనగణమణ ” ఈ రాగములో స్వరపరిచారు. కర్ణాటక సంగీత పితామహుడు పురందర దాసు సంగీత శిక్షణను **మాయామాళవగౌళ రాగంతో ప్రారంభించే సంప్రదాయం నెలకొల్పారు. అలాగే** పాశ్చాత్య సంగీత శిక్షణను శంకరాభరణం **రాగంతో ప్రారంభిస్తారు. ప్రముఖ వాగ్గేయకారులందరూ ఈ రాగంలో కీర్తనలు రచించారు. చలనచిత్ర సంగీతంలో** శంకరాభరణం ఉపయోగించడం ఒక మాదిరిగా మాత్రమేనని చెప్పాలి. సినిమాలలో అవసరమైన సందర్భానుసారమైన సంగీతం ఉత్పత్తికి ఈ రాగంలోని స్వరాలు అంతగా అనుకూలం కాకపోవడమే అందుకు కారణం. శంకరాభరణం కంటే దాని జన్యరాగాలలోనే ఎక్కువ జనరంజకమైన పాటలు వచ్చాయి. కానీ శాస్త్రీయసంగీతంలో మాత్రం ఈరాగం మకుటం లేని మహారాజు వలె భాసిస్తుంది.

02.10.2022 బేగడ

బేగడ సర్వోత్కృష్టమైన కర్ణాటక రాగం. బేగడ మీగడలా ఉంటుందని ప్రతీతి. 29వ మేళకర్త శంకరాభరణం జన్యంగా పరిగణించబడుతుంది. ఆరోహణంలోని ద్వంద్వ-వక్ర సంచారం ఈ రాగం యొక్క ప్రధాన లక్షణం. మధ్యమ, నిషాద స్వరాలతో కూడిన విన్యాసాలే ఈ రాగంలోని ప్రత్యేకత. బేగడలో రెండు నిషాదాలూ (కైశిక మరియు కాకలి) వాడబడతాయి. శంకరాభరణంలోని నిషాదం (కాకలి) కంటే హరికాంభోజిలోని నిషాదం (కైశికి) వినియోగం ఎక్కువగా ఉంటుంది కనుక హరికాంభోజి జన్యంగా భావించడం సమంజసమనే వాదం కూడా విద్వాంసులలో ఉంది.

రంజకత్వం వషయంలో బేగడ శహన, సావేరి, ఆనందభైరవి వంటి రాగాల కోవకు చెందినది, పురాతన గ్రంథాలు బేగడను సూచించలేదు. రంగ్ మహల్ రాగి ఫలకాలలో మొట్టమొదటిగా అన్నమాచార్య రచనల్లో ఈ రాగం ప్రస్తావన ఉంది. పురందరదాసు యొక్క దేవరనామ "హరియే సర్వోత్తమ", క్షేత్రజ్ఞుల "ఏల పాడరే"లో ద్వారా బహుశా 16వ శతాబ్దం నుండి బేగడ ఉనికి ఉన్నట్లు తెలుస్తోంది. బెగడలో సంగీత త్రిమూర్తుల ప్రతి ఒక్కరివి ఒకటి కంటే ఎక్కువ కీర్తనలు చేయబడ్డాయి. ఇది హాస్య, శృంగార, అద్భుత రసాలను అందించే రాగం. పిఠాపురంకు చెందిన ప్రఖ్యాత వైణిక విద్వాంసులు తుమరాడ సంగమేశ్వర శాస్త్రి గారు బేగడను వినసొంపైన రీతిగా వినిపించేవారని చెప్తారు.
సినిమా సంగీతంలో ఈ రాగం ఉనికి బహు స్వల్పం. బేగడ, కేదారగౌళ, సురటి వంటి కొన్ని రాగాలలో ఎంత సరళీకరించినా సాంప్రదాయఛాయలు తొంగి చూస్తూనే ఉంటాయి. అటువంటి రాగాలలో సినిమా తక్కువగనే వస్తాయి.

03.10.2022 - **ఆనందభైరవి**

**ఆనందభైరవి ఒక కర్ణాటక రాగం. 20వ మేళకర్త నఠభైరవి నుండి జన్యం. మొత్తం ఏడు స్వరాలను ఉపయోగించినప్పటికీ, ఆరోహణంలో వక్ర ప్రయోగం గల రాగం. మాతృరాగంలో లేని అన్య స్వరాలు కూడా ఉపయోగించబడుతాయి.**

శ్రావ్యమైన గమకాలు మరియు గంభీరమైన స్వర విన్యాసాలతో అలరారే ఒక విలక్షణమైన శాస్త్రీయ రాగం, ఆనందభైరవి. కరుణ రస ప్రధానమైనది. నృత్య ప్రదర్శనలలో కొన్ని అంశాలకు ఎక్కువ వాడబడుతుంది. కూచిపూడి భాగవతులు అభిమానించే రాగం గా ప్రసిద్ధం. హిందుస్తానీ లో ఈ రాగాన్ని పోలిన రాగమేదీ లేదు. రీతిగౌళ చాలా సన్నిహిత రాగం.

శాస్త్రీయ సంగీత ప్రదర్శనలలో సుస్థిర స్థానం గల చలనచిత్ర సంగీతంలో ఆనంద భైరవి బహు స్వల్పంగా కనబడుతుంది. పూర్తిగా ఈ రాగంలోనే ఉన్న పాటలు పది కూడా ఉండకపోవచ్చు. సంగీత చికిత్స (మ్యూజిక్ థెరపీ) విధానంలో అధిక రక్తపోటు స్థాయిలను తగ్గించడానికి, మానసిక స్థిరత్వాన్ని పెంపొందించడానికి మరియు మానసిక నైరాశ్యాన్ని నయం చేస్తుందని నిరూపించబడింది.

మధురా నగరిలో చల్లలమ్మ బోదు ఆనందభైరవి రాగంలో ప్రముఖ తెలుగు కర్ణాటక విద్వాంసులు, 'సంగీత కళానిధి' చిత్తూరు సుబ్రహ్మణ్యం పిళ్లై రచించారు.

చిత్రమేమంటే తెలుగులో వచ్చిన 'త్యాగయ్య' చిత్రం రెండు వెర్షన్లలోనూ ఈ కీర్తన కూచిపూడి భాగవతులు అభినయించినట్లు చూపారు. త్యాగరాజ స్వామి జీవించిన కాలం 4 May 1767 – 6 January 1847. గీత రచయిత సుబ్రహ్మణ్య పిళ్లై 1898–1975 మధ్య జీవించారు. అప్పటికి కూచిపూడి భాగవతులు ఉండడం,వాళ్ల యక్షగానాల్లో ఆనందభైరవి ఎక్కువ వాడడం వరకూ కరెక్టే. కాని అప్పటికి ఇంకా రచించబడని ఈ కీర్తనను చూపించడం తప్పు. మరో రచన ఏదో పెట్టాలి. బాపూ త్యాగయ్యలోనూ ఇదే తప్పు repeat అయింది. రేవతి రత్నస్వామి (చిత్తూరు సుబ్రహ్మణ్యం గారి అమ్మాయి) చాలా రోజుల క్రితం కాకినాడలో అభ్యుదయ ఫౌండేషన్ వ్యవస్థాపకులు బాదం మాధవరావు గారు (వారు మన ఎన్నెన్నో రాగాలు సభ్యులు కావడం విశేషం) సంగీత పోటీలకు జడ్జిగా పిలిస్తే వచ్చారు. అప్పుడు ఆవిడ కూడా మధురానగరిలో..... విషయం ధృవీకరించారు. పిళ్ళై గారు నాగయ్య గారి దృష్టికి తీసుకు వెళితే పొరపాటు జరిగిందని ఒప్పుకున్నారుట. ఈ విషయం బాపూ గారికి తెలిసి ఉండదు. ఆయనా అదే తప్పు రిపీట్ చేశారు.

ఆనందభైరవి నేటి మన రాగం కనుక ఈ విషయం ప్రస్తావించడం అప్రస్తుతం కాదనుకుంటాను.

## 04.10.2022 అమృతవర్షిణి

అమృతవర్షిణి రాగం పంతొమ్మిదవ శతాబ్దం ప్రారంభంలో ముత్తుస్వామి దీక్షితార్ చేత సృష్టించబడిన కర్ణాటక రాగం. సాహిత్యపరంగా, 'అమృతాన్ని కురిపించేది, (అమరత్వం ప్రసాదించేది) అని అర్థం. అమృతవర్షిణి వల్ల వర్షాలు కురుస్తాయని ఒక నమ్మకం. ఈ రాగం గురించి ఒక ప్రసిద్ధమైన కథ ప్రచారంలో ఉంది. తమిళనాడులోని ఎట్టయపురం అనే గ్రామాన్ని సందర్శించినప్పుడు, ముత్తుస్వామి దీక్షితార్ కరువు పీడితమై ఎండిపోయిన భూమిని, తీవ్రమైన నీటి కొరతను ఎదుర్కొంటున్న ప్రజలను చూసి బాధపడ్డారట. . వారి దీనస్థితిని చూసి చలించిపోయిన దీక్షితార్ ఆకాశం వైపు చూస్తూ ఈ రాగంలో దేవతను

స్తుతిస్తూ వర్షాలు కురిపించి కరువు పీడిత ప్రజల కష్టాలు తీర్చాలని దేవిని 'ఆనందామృతకర్షిణి, అమృతవర్షిణి' అని సంబోధిస్తూ వేడుకున్నాడు. 'సలిలం వర్షయ వర్ష' అంటే 'వర్షం కురిపించండి' అని పాడినప్పుడు ఆకాశం వర్షించింది. ఎడతెరిపి లేకుండా కుండపోత వర్షం కురిసింది. ఆ తర్వాత దీక్షితార్ 'స్థంభయ స్థంభయ', అంటే 'ఆపు, ఆపు' అని వేడుకున్నాడు. ఈ సంఘటన వల్ల వానలు విఫలమైనప్పుడు సంగీత విద్వాంసులు ఒకచోట చేరి ఈ స్వరకల్పనను పాడే అభ్యాసాన్ని ప్రారంభించారు.
అమృతవర్షిణి రి-రిషభం, ధ-ధైవతం లేకుండా మిగిలిన 5 స్వరాలు (ఔడవ-ఔడవ) గల సౌష్టవమైన రాగం. 65వ మేళకర్త కళ్యాణి లేదా 66వ మేళకర్త చిత్రాంబరి జన్యంగా భావించవచ్చు. ధైవతం లేనందున ఈ 2 మేళకర్తలలో దేనికైనా ప్రమాణం సరిపోతుంది. ఈ రాగంలోని స్వర సమ్మేళనాలు మనస్సుపై గొప్ప ప్రభావాన్ని కలిగిస్తాయని చెప్పబడుతున్నది. కానీ అతిగా విస్తరించిన ఆలాపన ఈ రాగం దాని ఆకర్షణను ప్రభావాన్ని కోల్పోతుంది. రాగం-తానం-పల్లవిలో రాగమాలికలో ఈ రాగం హాట్ ఫేవరెట్. హిందుస్తాని శాస్త్రీయ సంగీతంలోని మల్హార్ రాగం అమృతవర్షిణికి సమానం.

06.10.2022 హేమంత్

పాటలు పదికాలాలు పాడుకునేలా ప్రజలనోట నిలవాలి అన్నది ఘంటసాల స్వరదీక్ష. మాస్టారు కర్ణాటక సంగీతంతో పాటు హిందుస్తాని రాగ పద్ధతులను, ప్రక్రియలను ఔపోసన పట్టి ఎంతో అద్భుతమైన స్వరసమ్మేళనతో మనకు ఎన్నెన్నో మధుర రాగాలను అందించారు. అలాంటి సుమధుర రాగాల కోవకు చెందిన మరొక మధురమైన సరికొత్త రాగం హేమంత రాగం. వేరెవరూ ప్రయోగించని, పండించని, నిండైన నాదనిధి, మనస్వర పెన్నిధి ఘంటసాల. ఆయన హేమంత్ రాగాన్ని తన స్వంతంచేసుకుని, స్వరసవరణలు చేసి, భక్తిగాని, రక్తిగాని, శక్తిగాని, ఏ భావానికైనా సరిపడేలా ఆరాగాన్ని మలచి దిద్దినారు. మరుగునవున్న రాగానికి మెఱుగులు దిద్ది, నాదశుద్ధితో ఆత్మశుద్ధిని అందించా అమరగాయకులు. పండిత్ రవిశంకర్ గారి గురువైన అల్లాఉద్దీన్ ఖాన్ సృష్టించిన మధుర రాగం
హేమంత్ రాగాన్ని ఘంటసాల ఎప్పుడు విన్నారో తెలియదు. కాని ఆ రాగాన్ని అనుసరించి తెలుగు చిత్రసీమలో వినబడె మొదటిపాట చిత్రంలో "రావే ప్రేమలతా" పాటకు ముందు "చూపుల తీపితో కొసరుచున్" అనే పద్యం
ఈ కాల పరిధిలో (1959-1975) తెలుగు సినిమాలలోగాని, కర్ణాటక సంగీతంలోగాని ఎవరూ ఈ "హేమంత్" రాగం జోలికి పోయినట్లు వినబడదు. ఈ నేపథ్యంతో మనకు తెలియవచ్చే అంశమేమనగా, హేమంత్ రాగంలో ప్రయోగాలు చేసి, పరిష్కరించి, స్వరాల నవవిన్యాసాలను కట్టి, పాడి, పాడించినది ఒక్క ఘంటసాల మాత్రమే. హేమంత్ రాగం "హిందూస్తాని" క్షేత్రంలో అంతగా ప్రసిద్ధి పొందలేదు. కర్ణాటక సంగీతంలో అసలే కనబడదు. ఔడవ - సంపూర్ణమేళమైన ఈ అద్భుతమైన రాగంలో ఏ కీర్తనా వినబడదు. ఇప్పటికి ఘంటసాల సృష్టించిన పైన పేర్కొన్న పాటలు పద్యాలే ఈ " హేమంత్" రాగానికి మాతృకలై నిలిచాయి అనడం అతిశయోక్తికాదు.

07.10.2022 **హమీర్ కళ్యాణి**

**ముత్తుస్వామి దీక్షితార్ వారణాసిలో కొన్ని సంవత్సరాలు ఉండడం వల్ల ఉత్తర భారతదేశంలో ప్రాచుర్యంలో ఉన్న కొన్ని రాగాలను కర్ణాటక సంప్రదాయానికి పరిచయం చేశారు. అలాంటి రాగాలలో హమీర్ కళ్యాణి ఒకటి. హిందూస్థానీ సంగీతం నుండి దిగుమతి అయి ఇప్పుడు కర్ణాటక సంగీతంలో అంతర్భాగంగా మారింది. 65వ మేళకర్త (మేచ) కళ్యాణికి జన్యరాగం. ఆరోహణలో రి-రిషభం గ-గాంధారం లేకుండా 5 స్వరాలు, అవరోహణలో 7 స్వరాలు (5-7 ఔడవ -**

**సంపూర్ణ ఉభయ వక్రము). అవరోహణలో మధ్యమంలోని 2 స్వర స్థానాలూ (శుద్ధ - ప్రతి మధ్యమాలు) ప్రయోగించబడడంతో రాగం క్రొత్త అందాలు సంతరించుకుంటుంది. అమీర్ కళ్యాణి అని పలకడం తప్పుగానే భావించబడుతుంది. ఈ రాగం తెచ్చే ఆనందాన్ని వివరించడం కష్టం. సున్నితమైన గమకాలు, క్లిష్టమైన సంగతులు ఈ రాగానికి విశిష్టతలుగా నిలుస్తాయి. గంభీరమైన భావ ప్రకటన ఈ రాగం ప్రత్యేకత. కేదార అని కూడా పిలువబడే రాగ కేదార్ హిందూస్థానిలో హమీర్ కళ్యాణికి సామ్యంగా చెప్పవలసిన శాస్త్రీయ రాగం. పేరులోని పోలికను బట్టి హిందూస్థాని లోని హమీర్ రాగాన్ని హమీర్ కళ్యాణిని మూలమైన రాగంగా చెప్పే వీలులేదు. హిందూస్థాని కేదార్ మాత్రమే ఈ రాగానికి హిందూస్థానీ తుల్యరాగం. హిందుస్థానిలో హమీర్ లోనూ, కర్ణాటక సంగీతంలో సారంగ రాగంలోనూ హమీర్ కళ్యాణితో సాన్నిహిత్యాన్ని వినడంలో మనం గమనిస్తాం.**

*రాగ్ కేదార్ :*

**శివుడి పేరు పెట్టబడిన ఈ కేదార్ రాగం భారతీయ శాస్త్రీయ సంగీతంలో ఎత్తైన పీఠంపై ఉంచబడింది. కళ్యాణ్ థాట్ నుండి ఉద్భవించింది. ఈ రాగం రాత్రి మొదటి ఝాములో పాడాలి. కళ్యాణ్ పంచక్ గా పిలువబడే ఐదు రాగాలలో కేదార్, హమీర్ లు ఉన్నాయి. హమీర్ కళ్యాణి/ కేదార్ రాగాలను తమిళ సినిమాలోని కొన్ని పాటలలో కొందరు సంగీత దర్శకులు ఉపయోగించగా హిందీ సంగీత దర్శకులు శాస్త్రీయమైన గీతాలు రూపొందించడానికి వాడారు. కర్ణాటక సంగీతంలోని శంకరాభరణానికి జన్యరాగం 'కేదారం' కు రాగ్ కేదార్ తో పోలిక లేదు.**

*రాగ్ కేదార్ గురించి బహుళ ప్రచారంలో ఉన్న ఐతిహ్యం*

**నర్సింగ్ (నర్సీ) మెహతా 14వ శతాబ్దిలో గుజరాత్ లో జీవించిన కవి, గాయకుడు, కృష్ణ భక్తుడు. మహాత్మా గాంధీ అమితంగా ఇష్టపడే 'వైష్ణవ్ జనతో...' రచించినది నర్సీ మెహతాయే. ఆయన కేదార్ రాగం పాడితే శ్రీకృష్ణుడు ప్రత్యక్షమయ్యేవాడని చెప్పుకుంటారు. నర్సీ మెహతా ఒక బీద బ్రాహ్మణునికి ద్రవ్య సహాయం చేయడం కోసం కేదార్ రాగాన్ని ఒక వడ్డీ వ్యాపారి వద్ద తాకట్టు పెట్టారు. రాజు ఆయనను పరీక్షించడానికి పెట్టిన పరీక్షలో తన భక్తుని మర్యాద నిలబెట్టడం కోసం శ్రీకృష్ణుడు నర్సింగ్ రూపంలో వచ్చి వ్యాపారికి అప్పు చెల్లించి ఆయన కేదార్ రాగం మళ్లీ పాడుకునేలా కటాక్షించారని ఆ ప్రాంతంలో చెప్తారు.**

08.10.2022 గౌరిమనోహరి

గౌరిమనోహరి ఒక ప్రశాంతమైన, ప్రార్థనకు అనువైన రాగం. ఒక సంపూర్ణ రాగం (23 వ మేళకర్త). 59 వ మేళకర్త రాగమైన ధర్మవతి రాగమునకు శుద్ధమధ్యమ సమము. ఈ రాగములోని 'గురులేక యెటువంటి గుణికి తెలియగ పోదు' త్యాగరాజు కీర్తనలలో విశిష్టమైనది. హిందూస్థాని సంగీతంలో ఈ రాగానికి కచ్చితమైన సమానరాగం లేదు కాని కాఫీ థాట్ కు చెందిన ఔడవ-సంపూర్ణరాగం పటదీప్ (ఆరోహణలో 5 రిషభ, దైవతాలు లేకుండా, అవరోహణలో 7 స్వరాలు) ఉపశాస్త్రీయ, చలనచిత్ర సంగీతాలకు సంబంధించినంత వరకు సామ్యంగా భావించబడుతున్నది. 'భీమ్పలాస్ (అభేరి) - పటదీప్' ఆ రెండు రాగాలకూ

తేడా ఒక్క చిన్న స్వరం నిషాదం మాత్రమే. పటదీప్ రాగం కొద్దిగ అపురూపమైన పేరనుకొన్నా, విన్నంతనే మనకు సన్నిహితమయ్యే రాగం. ఉత్సుకతను మధురమనోజ్ఞంగా వెల్లడించి వియోగవేదన భావాన్ని విస్తరించగల రాగం. రెండు సంప్రదాయాలలో తులనాత్మకంగా పరిశీలిస్తే కర్ణాటక సంగీతంలో గౌరిమనోహరి కంటె హిందూస్థానీలో పటదీప్ విస్తృతంగా వాడబడే రాగం అనిపిస్తుంది.

## 09.10.2022 పహాడీ

ప్రకృతి ప్రశాంతతకు ప్రతిరూపం. సప్తస్వరాలు ప్రకృతినుండే గ్రహించబడినా సప్తస్వర సమ్మేళనమైన సంగీతం వివిధ రాగాల రూపంలో నవరసాలనూ ఉత్పన్నం చేస్తున్నది. కానీ ప్రయోగాలకూ, వినియోగానికీ ఎక్కువ గురికాబడని జానపద సంగీతంలో ప్రకృతి రామణీయకత ఎక్కువ ప్రతిబింబించడం వల్ల ఆ సంగీతం నుండి తీసుకోబడిన రాగాల్లో ప్రశాంతతే మౌలిక లక్షణంగా గోచరిస్తుంది. అటువంటి రాగాల్లో తన పేరులోనే సూచించబడినట్లుగా పర్వతప్రాంత సంగీతశైలుల నుండి గ్రహించబడిన పహాడీ రాగం అగ్రగామిగా నిలుస్తుంది.

కాశ్మీర్, పంజాబ్ పర్వతప్రాంతాల పల్లెపాటలను తలపించే ఈ రాగం ఆధారంగా ఎన్నో లలిత గీతాలు, గజల్, టుమ్రీ, భక్తి సంగీతం, చలనచిత్ర సంగీతం రూపొందించడం జరిగింది. ఇది తేలికపాటి రాగం. 'ధున్' లాగా ఉంటుంది. అన్యస్వరాల ప్రయోగం ఎక్కువగా ఉంటుంది. తారాస్థాయిలో ఎక్కువగా వినిపించరు. మధ్యమశ్రుతిలో పాడడం పరిపాటి. శాస్త్రపరంగా పహాడీ బిలావల్ థాట్ కు చెందిన రాగంగా వర్గీకరించబడుతుంది. సాయంకాలం పాడదగిన రాగం. స్థూలంగా చూస్తే భూపాలీ, దేశికర్, శుద్ధకళ్యాణ్ (మోహనకళ్యాణి) రాగాల్లో ఉండేవీ పహాడీలో ఉండేవీ అవే అయిదు స్వరాలు. కానీ సందర్భానుసారంగా సంగీతంలో గల పన్నెండు స్వరస్థానాలనూ కూడా వాడుతూ ఈ రాగంలోని కొత్త పార్శ్వాలను సంగీత దర్శకులు మనకు దర్శింపజేస్తారు. హిందుస్తానీ విద్వాంసులు స్వల్పవ్యవధి అంశాలకు వాడడమే ఎక్కువ జరుగుతుంది. వాద్య కళాకారులు వాయించినవి ఈ రాగంలో చాలా ఆకర్షణీయంగా ఉంటాయి. కర్ణాటక సంగీతంలో మరీ తక్కువ వినబడుతుంది. లాల్గుడి జయరామన్ తన తిల్లానా ద్వారా దాక్షిణాత్య సంగీత ప్రియులకు ఈ రాగం అందాన్ని పరిచయం చేశారనవచ్చు.

హిందీ సంగీత దర్శకులలో ఈ రాగం ప్రభావం పడనివారు లేరు. ఎన్నెన్నో రొమాంటిక్గా, ఉత్సాహంగా సాగే హిందీ సినిమా పాటలు అందరినీ ఆకట్టుకుంటాయి. పహాడీలో స్వరపరచిన తెలుగు సినిమా పాటల సంఖ్య కూడా ఎక్కువే. ఈ రాగానికి శాస్త్రీయ సంగీత కళాకారుల కంటే ఎక్కువ ప్రజాదరణ సంపాదించి పెట్టిన ఘనత చలనచిత్ర సంగీత దర్శకులే సాధించారంటే అతిశయోక్తి కాదు. కాకపోతే పైన పేర్కొన్నట్టు ఈ రాగానికున్న జానపద సంగీత మూలాల

దృష్ట్యా దర్శకులు స్వతంత్రించి చేసే అన్యస్వర ప్రయోగాల వలన పహాడీలో కూర్చిన కొన్ని గీతాల రాగనిర్ధారణ విషయంలో సంగీత విశ్లేషకులలో ఏకాభిప్రాయం లేకపోవడం ఎక్కువగా చూస్తుంటాం.

1964లో ఆకాశవాణి వారు రవీంద్ర భారతిలో వర్ష ఋతువుపై ఒక కార్యక్రమం ఏర్పాటు చేశారు. అందులో పాల్గొనడానికి వోలేటి వెంకటేశ్వర్లు గారు విజయవాడ నుండి వచ్చారు. ఆయన, చిత్తరంజన్ గారూ దేవులపల్లి కృష్ణశాస్త్రి గారి ఇంట్లో ఉండగా కృష్ణశాస్త్రి గారి అబ్బాయి బుజ్జాయి అప్పుడే కొని తెచ్చుకున్న ఒక ఎల్పీ రికార్డు లో హిందుస్తానీ గాత్ర సంగీతం ప్రక్కగది నుంచి వినబడుతోంది. అది పాకిస్తానీ గాత్ర విద్వాంసులు నజాకత్ ఆలీ (1928-'84), సలామత్ ఆలీ (1934-2001) సోదరులు పాడుతున్న పహాడీ రాగంలో టుమ్రీ 'సయ్యా బిన్ ఘర్ సునా'. వోలేటి గారు అది విని పరవశులై అరగంట సేపు పహాడీ రాగం అద్భుతంగా గానం చేశారు. కృష్ణశాస్త్రి గారు తానొక గీతం వ్రాస్తాననీ దానికి బాణీ కట్టమనీ వోలేటి వారిని కోరారు. వెంటనే వోలేటి అంగీకరించి పహాడీ రాగం లోనే ఆ గీతాన్ని స్వరపరిచారు. ఈ సంఘటన ఫలంగా ఉద్భవించినదే ఈ కడచేనటే సఖియా ఈ రాతిరి గీతం. మరునాడు రవీంద్ర భారతిలో జరిగిన కార్యక్రమంలో శ్రీ వోలేటి ఈ గీతాన్ని అద్భుతంగా గానం చేశారు.

## 10.10.2022 దర్బారీకానడ

దక్షిణాది రాగం కానడ తాన్సేన్ ద్వారా రాజదర్బార్ లలో ప్రవేశించి దర్బారికానడగా చక్రవర్తుల అభిమానపాత్రమైంది. దర్బారికానడ చక్రవర్తుల రాగమే కాదు రాగాలలో చక్రవర్తి కూడా! దర్బారికానడ 20వ మేళకర్త నఠభైరవి జన్యం. ఉభయ వక్ర సంపూర్ణ రాగం. ఆరోహణ, అవరోహణలలో 7 స్వరాలు పలుకుతాయి కాని వక్ర సంచారం ఉంటుంది. హిందుస్తానీ లో అసావరి ధాట్ రాగంగా పరిగణించబడుతుంది. ఇది ఒక విషాద రాగం. హిందుస్తానీ సంప్రదాయంలో అర్ధరాత్రి పూట పాడవలసిన రాగం. ప్రావీణ్యం పొందడం చాలా కష్టతరమైనదిగా పరిగణించబడుతుంది. తీవ్ర భావోద్వేగ ప్రభావాన్ని కలిగి ఉంటుంది. అందువల్ల, హెచ్చు స్థాయి ప్రయోగాల కంటె సాధారణంగా మంద్ర స్థాయిలోనే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. సంగీతం ద్వారా చేసే చికిత్సా విధానంలో వత్తిడి, ఆందోళనను తగ్గించడంలో చాలా ప్రభావవంతంగా పనిచేస్తుందని, తీవ్రమైన తలనొప్పి, మైగ్రేన్, దుఃఖం, మానసిక షాక్ ల నుండి గొప్ప ఉపశమనాన్ని అందిస్తుందని, ఏకాగ్రతను మంచి నిద్రను పెంపొందిస్తుందని ఫలితాలు సూచిస్తున్నాయి. ఈ రాగం ఉత్తర భారత చలనచిత్ర సంగీతంలో విస్తృతంగా ఉపయోగించబడింది. తెలుగులో కూడా ఈ రాగంలో మనోహరమైన పాటలు చాలా ఉన్నాయి. కొన్ని పాటలు చాలా శక్తివంతమైనవి, శ్రావ్యతలో విలక్షణమైనవి. కర్ణాటక సంగీత కచేరీలలో చివరి అంశాలలో హిందుస్థానీ విధానంలో రమ్యమైన భజన్స్ ఈ రాగంలో గాయకులు వినిపిస్తుంటారు. ఎమ్మెస్ రామారావు గారి

తెలుగులో సుందరకాండ రికార్డుల ద్వారా ఈ రాగం ప్రజలకు మరింత చేరువైందని నా అభిప్రాయం (ఘంటసాల గారి శివశంకరీ...తరువాత)

## 11.10.2022 పీలూ

పీలు చాలా ఆహ్లాదకరమైన హిందుస్తానీ శాస్త్రీయ రాగం. కాఫీ థాట్కు చెందినది. సందర్భానుసారం 12 స్వరాలూ పలికే రాగం. చాలా రాగాల్లో వినబడే స్పష్టమైన ఆరోహణ, అవరోహణ లేకపోవడంతో దీన్ని గుర్తుపట్టడం కాస్త కష్టమనిపించవచ్చు. కీరవాణి సన్నిహిత రాగం. పీలూ రాగంలో ఆశ, ఆనందం, బాధ వంటి వివిధ భావోద్వేగాలు అన్నీ కలగలిసి ఉంటాయి. అందువల్ల సాధారణంగా రొమాంటిక్ థీమ్లపై ఉండే గీతాలలో వినపడుతుంది. ఎక్కువగా ఠుమ్రి వంటి ఉపశాస్త్రీయ రూపాల్లో ఉపయోగించ బడుతుంది. ఈ రాగం హోలీ పండుగ సందర్భంగా పాడే పాటలకూ ప్రసిద్ధి చెందింది. రోజులో మూడవ జాములో పాడవలసిన రాగం. పీలూ రాగానికి కర్ణాటక రాగం కాపీ తుల్యమైన రాగంగా భావించబడుతుంది కానీ అన్ని సందర్భాల్లోనూ నిజమని అనలేము. కాలానుగతంగా కాపీ రాగం పాడడంలో కర్ణాటక సంగీతంలో వచ్చిన మార్పులే అందుకు కారణం.

సినిమా సంగీతంలో పీలూ రాగం పాత్ర చెప్పుకోదగ్గదే. హిందీలో ప్రతి సంగీత దర్శకుడూ ఈ రాగాన్ని విజయవంతంగా వాడినా ఓ పీ నయ్యర్ రికార్డును ఎవరూ బ్రద్దలు కొట్టలేరు. 1958లో వచ్చిన 'ఫాగున్' చిత్రంలో 7 పాటలు పీలూ రాగంలో నయ్యర్ చేశారు. అప్పటి ప్రముఖ హిందుస్తానీ గాత్ర విద్వాంసుడు ఉస్తాద్ ఆమీర్ ఖాన్ నయ్యర్ ప్రతిభను మెచ్చుకుంటే నయ్యర్ వినమ్రంగా 'ఖాన్ సాబ్! నాకు సంగీతంలో ఎబిసిడిలు తెలియవు' అని బదులిచ్చారట.

## 12.10.2022 గుర్జరీ తోడి

గుర్జరీ తోడి రాగం హిందుస్థానీ తోడి థాట్లోని ఒక రాగం . భారతదేశంలోని ఉత్తర, పశ్చిమ ప్రాంతాలలో ప్రధానమైన గుర్జర్ (గుజ్జర్) జాతి ప్రజలనుండి ఉద్భవించి ఉండవచ్చు. ఈ రాగం గుజరాత్ నుండి ఉద్భవించి ఉంటుందని మరొక అభిప్రాయం ఉంది. కాగా మరికొందరు ఈ రాగం మూలాలు రాజా మాన్సింగ్ మరియు అతని భార్య మృగనయనిలకు సంబంధించినవిగా చెప్తారు. మృగనయని గుర్జర్ గిరిజనతెగకు చెందిన మహిళ కావడం అందుకు కారణం. గుర్జర్ గిరిజనులు తోడి (హిందుస్తానీ)ని విస్తృతంగా పాడేవారు కానీ పంచమం లేకుండా ఆ రాగం పాడడం వల్ల తోడి (సంపూర్ణ రాగం, మియాన్ కీ తోడి అని కూడా పిలుస్తారు) తో తేడా కోసం గుర్జరి తోడిగా పిలువనారంభించారు. ఇది కరుణ రసంతో నిండిన రాగం. ఆరోహణ, అవరోహణలలో 6-6 పంచమం లేకుండా) స్వరాలు గల (షాడవ-షాడవ) రాగం.

సాధారణంగా రోజులోని రెండవ జాములో (అంటే ఉదయం 9 నుండి మధ్యాహ్నం వరకు) పాడాలి. ఈ రాగాన్ని శుభపంతువరాలితో పోలినరాగంగా చెప్పవచ్చు.

కర్ణాటక సంగీతంలో కూడా గుర్జరి పేరుతో ఒక రాగం ఉన్నది. మాయామాళవగౌళ జన్యం. దీక్షితార్ రచన 'గుణిజనాది నుత', త్యాగరాజ కీర్తన 'వరాలందుకొమ్మని నాయందు వంచన సేయ న్యాయమా' కీర్తనలు ఈ రాగంలో పాడబడుతున్నాయి. ఇది గుర్జరీతోడి యొక్క కర్ణాటక తుల్యరాగమా కాదా అని భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. రెండింటి జనక రాగాలు (కర్ణాటక రాగం మాయామాళవగౌళ, హిందుస్థానీ థాట్ తోడి) వేర్వేరు కావున ఈ రెండు రాగాల మధ్య సామ్యం లేదనే విద్వాంసుల అభిప్రాయం.

## 13.10.2022 అభోగి

అభోగి కర్ణాటక సంగీతంలో 22వ మేళకర్త కరహరప్రియకు జన్య రాగం. ప-పంచమం ని-నిషాదం లేకుండా ఆరోహణ అవరోహణలలో మిగిలిన 5 స్వరాలు ఉంటాయి. (ఔడవ - ఔడవ సౌష్ఠవ రాగం). గౌరీమనోహరి నుండి పంచమం, నిషాదం రెండింటినీ వదిలివేయడం ద్వారా కూడా అభోగి ఏర్పడుతుంది. శ్రీరంజని అభోగి చాలా సన్నిహిత రాగాలు. అభోగి కర్ణాటక సంగీతం నుండి హిందూస్థానీ సంగీతంలోకి తీసుకోబడి వారికి అనుగుణంగా మార్చబడింది. కర్ణాటక రాగాలను హిందుస్తానీలోనికి తీసుకోవడంలో వారిదొక విధానం మనం గమనిస్తాం. మన రాగాన్ని యథాతథంగా తీసుకోకుండా హిందుస్తానీలో ప్రాచుర్యంలో ఉన్న రాగ కుటుంబంలోని రాగాలతో కలిపి వాడతారు. ఇలా రెండు రాగాలను కలిపి క్రొత్త రాగాలను (జోడ్ రాగాలు లేక compound రాగాలు) రూపొందించే విందాం వారికి ఉన్నది. ఆ ప్రకారం కర్ణాటక సంప్రదాయంలోని అభోగిని హిందుస్థానీ శైలిలోని కానడ రాగంతో మిశ్రమం చేసి అభోగికానడగా రూపొందించారు. తరువాతి కాలంలో కూడా బాగా ప్రాచుర్యం పొందింది. అభోగికానడ కాఫీ థాట్ కిందకు వస్తుంది. కర్ణాటక హిందుస్థానీ అభోగిలు దాదాపు ఒకేలా ఆరోహణలు మరియు అవరోహణలు కలిగి ఉన్నాయి. అభోగికానడకు బాగేశ్రీ సన్నిహిత రాగం.

## 14.10.2022 ఆహిరి

ఆహిరి కర్ణాటక సంగీతంలో ఒక పురాతన రాగం. 14వ మేళకర్త వకుళాభరణంకు జన్యరాగం. 8వ మేళకర్త తోడి (హనుమత్తోడి) తో కూడా సంబంధం కలిగి ఉంటుంది. ఇది ఆరోహణ అవరోహణలో మొత్తం ఏడు స్వరాలు కలిగి ఉన్నప్పటికీ అవి వక్ర సంచారము కలిగి ఉండటం వల్ల జన్యరాగం గానే పరిగణిస్తారు . ఆహిరి రాగంలో ప్రావీణ్యం పొందడం కష్టమైన విషయంగా భావించబడుతుంది, అందువలననే కావచ్చు చాలా విశేషమైన కీర్తనలు లభ్యమౌతున్నా

ఎక్కువగా పాడడం చూడం.  కానీ ప్రావీణ్యం సాధిస్తే  అంతటి గుర్తింపూ లభిస్తుంది.  ఈరాగం కరుణ రసానికి పర్యాయపదంగా ఉంటుంది.  ఇది ఉదయాన్నే పాడే  రాగంగా పరిగణించబడుతుంది. విలంబకాలంలోనే పాడుతారు.

సినిమా పాటలలో ఆహిరి రాగం గురించి వెదకడం ఫలితాన్నివ్వదు.  తెలుగులో లేవనే చెప్పవచ్చు  (ఈరోజు మీరు వింటున్నది ఒక తమిళ అనువాద చిత్రంలోని పాట).  తమిళ, మలయాళ ప్రేక్షకుల నుంచి వివిధ రాగాలలో పాటల గురించిన ఎక్స్పెక్టేషన్స్  సంగీత దర్శకులపై ఉంటాయి.  అందువల్ల అక్కడ ఎంత అరుదైన రాగంలోనైనా కొద్ది పాటలు దొరకకపోవు.

సాధారణంగా కీర్తనలు పాడడం పల్లవితో ప్రారంభిస్తారు. అదే 'పదం' (ఉదా. క్షేత్రయ్య పదాలు) ఎక్కువ సందర్భాల్లో అనుపల్లవితో మొదలుపెట్టారు. త్యాగరాజ స్వామి కీర్తనలలో కొన్ని అనుపల్లవితో ఆరంభించడం చూస్తుంటాం. ఆ విధంగా పాడడం ఆ కీర్తనలకు చాలా అందాన్నిస్తాయి. అలాంటి ఒక కీర్తన ఈ 'చల్లరే రామచంద్రుని పై...'.  'సొంపైన...' అంటూ అనుపల్లవితో ప్రారంభించడం చాలా వినసొంపుగా ఉంటుంది. త్యాగరాజ స్వామి రచించిన 'ప్రహ్లాద భక్తి విజయం ' లోనిదీ కీర్తన.

15.10.2022 తిలంగ్

తిలంగ్ (తిలాంగ్, తిల్లాంగ్ అని కూడా పిలువబడుతుంది) ఖమాజ్ థాట్కు చెందిన హిందుస్థానీ రాగం. హిందుస్థానీ శాస్త్రీయ సంగీతంలో ఉద్భవించింది. కర్ణాటక సంగీతంలోకి తీసుకోబడింది. కర్ణాటక సంగీతంలో కూడా తనకంటూ ఒక సముచిత స్థానాన్ని ఏర్పరుచుకుంది. 28వ మేళకర్త హరికాంభోజికి జన్యరాగం. రి-రిషభ, ధ-ధైవతాలు లేని నిర్మాణంతో ఉన్న (5-5, ఔడవ-ఔడవ) రాగం. (ని-నిషాదం 2 స్థానాల్లో పలుకుతుంది. వాటిని కైశిక, కాకలి నిషాదాలని పిలుస్తారు). తిలంగ్  లో ఆరోహణలో కైశిక నిషాదం, అవరోహణలో కాకలి నిషాదం వాడుతారు. రెండూ కాకలి నిషాదమే ఉపయోగించబడే రాగం గంభీరనాట, తిలంగ్ కు మిక్కిలి సన్నిహితం.  తిలంగ్ ఎక్కువగా రాత్రిపూట పాడుతారు. మధురమైన, రొమాంటిక్ ,ఆహ్లాదకరమైన మానసిక స్థితిని కలిగిస్తుంది. ఇస్లామిక్ సూఫీ సంప్రదాయంలోను, ఠుమ్రీ గజల్ వంటి ఆధునిక గాన శైలులలో ఎక్కువగా ఉపయోగించబడుతుంది. ఈ రాగంలోని గుర్బానీ (సిక్కు మతరచన) ఇస్లామిక్ పదజాలంతో నిండియుండి, తిలంగ్ యొక్క ఇస్లామిక్ సూఫీ మూలాన్ని మరింత ప్రస్ఫుటం చేస్తుంది.  తిలంగ్ రాగాన్ని సిక్కు గురువులు మొత్తం 20 కీర్తనలకు ఉపయోగించారు.  కర్ణాటక సంగీతంలో చెప్పదగ్గ కృతులు రచించబడలేదు. ఇటీవలి వాగ్గేయకారుడైన పాపనాశం శివన్ కు ముందు ఈ రాగంలో రచన చేసినవారు లేరు. పూర్వ వాగ్గేయకారులైన అన్నమాచార్య, పురందరదాసు రచనలు ఆ రాగంలో నేడు మనకు కనబడుతున్నవి ఇటీవలి

కాలంలోని విద్వాంసులచే తిరిగి స్వరపరచబడినవి అని భావించాలి. సినిమా సంగీతంలో తిలంగ్ కు మంచి స్థానమే ఉన్నది. కానీ ఎక్కువ అన్యస్వర ప్రయోగాలు జరగడం వల్ల పాటలలోని తిలంగ్ మిశ్ర తిలంగే అవుతూ ఉంటుంది.

### 16.10.2022 బేహాగ్

బేహాగ్ (హిందుస్థానీలో బిహాగ్ అనే పిలుస్తారు) బిలావల్ థాట్(శంకరాభరణం)కు చెందిన హిందుస్థానీ రాగం. ఇది ప్రారంభకులకు, నిపుణులకు కూడా అనువైన శ్రావ్యమైన రాగం. 16వ శతాబ్దం నుండి విస్తృతంగా పాడబడే స్వచ్ఛమైన శాస్త్రీయ రాగాలలో ఒకటి. అనేక జానపద సంగీతాలలో కూడా బేహాగ్ ఉనికి ఉన్నది. మొత్తం ఏడు సంగీత స్వరాలూ ఉపయోగించబడుతాయి. 2 మధ్యమాలు తీసుకుంటుంది. ఔడవ-సంపూర్ణ వక్రం. ఆరోహణలో, రిషభ, ధైవతాలు ఉండవు. అవరోహణ వక్రమైనా సంక్లిష్టమైన వక్రం కాకపోవడం వల్ల రాగ విస్తరణ సులువుగా ఉంటుంది. 2 మధ్యమాలు వినియోగించడంలో ప్రతి మాధ్యమానికి ప్రాధాన్యత ఇస్తే, బేహాగ్ కళ్యాణ్ థాట్కి తగ్గట్టుగ అనిపిస్తుంది. అయినప్పటికీ, రాగ సౌందర్యం బిలావల్ (శంకరాభరణం) శైలితోనే ప్రకటమౌతుంది. బేహాగ్ రాత్రి రెండవ జాములో పాడదగిన రాగం. రవీంద్రనాథ్ ఠాగూర్ అనేక గీతాలలో మరియు వివిధ బెంగాలీ మరియు ఉత్తర భారత సంగీత రచనలలో ఉపయోగించబడింది. నృత్యసంగీతానికి కూడా చాలా ఆధారమైనది. , కర్ణాటక సంగీతంలో కచేరీ చివరి అంశాలలో, సినిమాలలో అన్నింటిలో హాయిగా వినదగ్గ రాగం.

### 17.10.2022 వాగధీశ్వరి

కర్ణాటక సంప్రదాయంలో 72 మేళకర్త రాగాలు ఉన్నట్లు వింటాము. మేళకర్తలు అన్నీ ఆరోహణ అవరోహణలలో 7 స్వరాలనూ కలిగి ఉంటాయి. ఇవి జనక రాగాలు. వీటినుండే ఇతర రాగాలు ఉద్భవిస్తాయి. ఈ వ్యవస్థకు వెంకటమఖి అనే శాస్త్రకారుడు ఆద్యుడని అంతకు ముందు 32 జనకరాగాలనే లెక్కించేవారని చెప్తారు. వెంకటమఖి ఆలోచనకు ప్రాతిపదిక సప్తస్వరాలనుంచి ఏర్పడే స్వరస్థానాలను 12 బదులు 16గా విభజించడం. ఈ మార్పు వల్ల అదనంగా ఏర్పడిన 40 జనక (మేళకర్త) రాగాలను 'వివాది' మేళకర్తలు అంటారు. ఈ 40 వినియోగం తక్కువ, వాటినుండి ఏర్పడే జనక రాగాలు తక్కువే. కానీ వీటిని పాడడం, మెప్పించడం ఒక ఛాలెంజే. ఈ ఉపోద్ఘాతం ఎందుకు అవసరమైనదంటే ఈరోజు మనం ఎంచుకున్న రాగం 'వాగధీశ్వరి' ఆ వివాది రాగాలలో ప్రముఖంగా చెప్పబడేది కావడమే.

వాగధీశ్వరి 34వ మేళకర్త రాగం. ముత్తుస్వామి దీక్షితార్ సంప్రదాయంలో 'భోగ ఛాయానాట' అని వ్యవహరిస్తారు. శుద్ధమధ్యమం కలిగివుంటుంది. ఈ రాగానికి 'నాసికాభూషణి' ప్రతిమధ్యమ తుల్యరాగం (counterpart). చాలా తక్కువ జన్యరాగాలు కలిగినది. వాటిలో 'మోహనాంగి' అనే రాగంలో బాలమురళీకృష్ణ 'నీ నామము నా జీవము...' అనే కీర్తన

రచించి పాడేవారు. వాగధీశ్వరి రాగంలో చాలా తక్కువ కీర్తనలు రచించబడ్డాయి. త్యాగరాజస్వామి రచించిన 'పరమాత్ముడు వెలిగే...' కీర్తన చాలా గొప్ప కీర్తన. ఆధ్యాత్మిక భావంతో నిండిన సాహిత్యం గల కీర్తన. రాగానికి హిందుస్తానీ సమానరాగం చెప్పబడలేదు. సినిమా సంగీతంలో రెండు తమిళ పాటలు సంగీత దర్శకులు ఇళయరాజా చేశారు. అందులో ఒకటి ఈరోజు విందాం.

'వివాది రాగాలు' విషయంలో విద్వాంసుల మధ్య కొంత ఏకాభిప్రాయం లేదు. కొందరు ఆ రాగాలను వాడకుండా, శిష్యులకు బోధించకుండా ఉన్న పరిస్థితి కూడా ఒకప్పుడు ఉండేది. అవి negative effect ఇచ్చే రాగాలని అనడం కూడా చూస్తాం. అలా అనుకుంటే ఆ రాగాలలో త్యాగరాజు, దీక్షితార్ కీర్తనలు ఎందుకు చేస్తారు? పాడి మెప్పించడంలో ఉన్న కష్టమే వాటిని ఎక్కువగా పాడకపోవడానికి ముఖ్య కారణం కూడా కావచ్చు. ఏదైనా ఇది పెద్ద సబ్జెక్టు లెండి.

ఆ రాగాలలో మంచి కీర్తనలు (సంఖ్యాపరంగా తక్కువే) కనబడుతూ, మీకనిపించినట్టే ఈ కీర్తన ఎందుకు ప్రాచుర్యం పొందలేదా అని విస్మయం కలిగిస్తుంటాయి.

## 18.10.2022 శుద్ధ సారంగ్

శుద్ధ సారంగ్ ఒక మధురమైన హిందుస్తానీ రాగం. కర్ణాటక రాగం 'హంసనాదం' తో కొంత పోలియుంటుంది. 'సారంగ్' కుటుంబ రాగాల్లో ఒకటి.  కళ్యాణ్ థాట్ కి చెందినది. గ-గాంధారం లేకుండా రెండు మధ్యమాలు కలిగి ఉంటుంది. రెండు మధ్యమాలు ఉండడం వల్ల ఈ రాగం జనక రాగాన్ని నిర్ధారించడం కొంచెం సంశయాత్మకంగా విద్వాంసులు భావిస్తారు. ఉదయం 9-12 గంటల మధ్య పాడవలసిన రాగం. కళ్యాణ్ థాట్ కే చెందిన మరో మధురమైన రాగం 'శ్యామ్ కళ్యాణ్' శుద్ధసారంగ్ కు సన్నిహిత రాగం. గాంధారం ఉనికియే ఈ రెండు రాగాల మధ్య వ్యత్యాసం.

ఎన్నో శాస్త్రీయ రచనలు, అంతకుమించి లలిత శాస్త్రీయ, సినిమా సంగీత గీతాలు శుద్ధసారంగ్ ఆధారితమైనవి వింటుంటాము. తెలుగు సినిమాలలో కూడా ఎక్కువగా ఉపయోగించే హిందుస్తానీ రాగాల్లో ముఖ్యమైనది.

## 19.10.2022 శ్రీరంజని

శ్రీరంజని ఒక పేరెన్నిక గల కర్ణాటక రాగం. ఆరోహణ, అవరోహణలో ప-పంచమ వర్జితంగా ఆరేసి స్వరాలు కలిగిన (షాడవ-షాడవ) రాగం. 22వ మేళకర్త ఖరహరప్రియకు జన్యరాగం.  శ్రీరంజనికి అభోగి చాలా సన్నిహిత రాగం. సామాన్య శ్రోతలు రెండు రాగాలనూ గుర్తించడంలో పొరపాటు పడతారు. కచేరీలలో విద్వాంసులు చాలా విస్తారంగా పాడే కొద్ది రాగాల్లో ఒకటి.  సాధారణంగా మొదటి సగంలోనే శ్రీరంజని పాడతారు. చాలా ప్రసిద్ధి పొందిన కీర్తనలు  ఈరాగంలో ఉన్నాయి. వాటిలో త్యాగరాజు కీర్తనలు హెచ్చుగా ఉంటాయి.  'సొగసుగ మృదంగతాళము', 'మారుబల్కకున్నావేమిరా',

'బ్రోచేవారెవరే', 'భువిని దాసుడనే', 'సరియెవ్వరే' వంటివి త్యాగరాజ కీర్తనలు. మరో విశేషం, ముత్తుస్వామి దీక్షితార్ రచనలు అన్నీ సంస్కృతంలో ఉండగా "నీ సాటి దైవమెందు లేదని మరులుకొంటిరా" అనే శ్రీరంజని రాగకీర్తన తెలుగులో ఉండడం. కచేరీని ఎంతో రక్తి కట్టించే ఈ రాగం స్వల్పవ్యవధి అంశాలకు తీసుకోవడం సాధారణంగా చూడము. అలాగే చలనచిత్ర సంగీతంలో శ్రీరంజనిని అరుదుగానే చూస్తాం. వెనుకటి సంగీత దర్శకులు పూర్తి శాస్త్రీయ వరుసలలోనే అక్కడక్కడ పాటలు చేశారు. ఎమ్మెస్ విశ్వనాథన్, ఇళయరాజా, విద్యాసాగర్ వంటి దర్శకులు చేసిన పాటలు కొన్ని ఉన్నా అవి అనువాద చిత్రాల ద్వారానే తెలుగు శ్రోతలకు చేరాయి. హిందుస్తానీ సంగీతంలో వాడబడడం, హిందుస్తానీలో సమానమైన రాగం కలిగియుండడం కూడా ఈ రాగం విషయంలో లేదు.

పద్యం పాడి మెప్పించడం సామాన్యమైన విషయం కాదు. పద్యం duration సుమారు 1ని. ఉంటుంది. రాగం యొక్క మొత్తం essence ఆ కొద్ది సమయంలోనే వ్యక్తమై పోతుంది. అదే effect మనకు శాస్త్రీయ సంగీత కళాకారులు రాగాలాపనలో ఇస్తారు. కాని ఆలాపన కు 'త-ద-రి-న' అనే అక్షరాలు ఆలంబనగా తీసుకుని పాడతారు. ఆ support లేకుండా పద్యంలో 'అ' కారంతోనే పాడాలి. ఇదే చాలా కష్టం. ఈ భావం నాది కాదు, ప్రముఖ సంగీత విద్వాంసులు శ్రీ మల్లాది సూరిబాబు గారు ఈ విషయం మీద వ్యక్తపరచినవి.

తిరువారూర్ ప్రశిద్ధ శైవ క్షేత్రాల్లో ఒకటి. శైవులు 'పెరియ పురాణం' అక్కడే రచించబడింది. అక్కడి సరస్సును కమలాలయం అని అంటారు. మూలవిరాట్టు త్యాగరాజ స్వామి, ఉత్సవమూర్తిని వాల్మీకనాధుడని పిలుస్తారు. కమలాంబిక, నీలోత్పలాంబికలుగా అమ్మవార్లుగా వెలిసారు. దీక్షితార్ ఆ క్షేత్రంలోని దేవీ, దేవతలపై చాలా కీర్తనలు రచించారు. కమలాంబా నవావరణ కీర్తనలు ఈ క్షేత్రంలోని మూర్తులపైనే వ్రాసారు. శ్రీ చక్రోపాసనకు సంబంధించిన ఎన్నో మంత్ర రహస్యాలు ఆ కీర్తనలలో నిక్షిప్తం చేశారు.

ఇక్కడి 'వల్మీకనాధుని' స్థలపురాణం నేపధ్యంలో రచించిన కీర్తన ఇది. ఇంద్రాది దేవతలు చెదపురుగుల రూపంలో విష్ణుమూర్తిని పరీక్షకు గురిచేస్తే ఆ పుట్టనుండి వచ్చి విష్ణువును రక్షించినట్లున్న ఒక ఘట్టాన్ని ఆ అనుపల్లవి సాహిత్యం వర్ణిస్తోంది. (వాసవ- ఆది-అమరులెల్ల-వమ్రి.....)(వమ్రం=termite)

## 20.10.2022 తిలక్ కామోద్

తిలక్ కామోద్ అనే ఒక సున్నితమైన హిందుస్తానీ రాగంలో గీతాలు ఈరోజు విందాం. ఈ రాగం ఎంచుకోవడం ఒక సాహసమే. ఎందుకంటే సంగీత విద్యార్థులకే కాదు, విద్వాంసులలో కూడా ఆ రాగాన్ని విశ్లేషించడంలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. కానీ శ్రావ్యత దృష్ట్యా విరివిగా వాడబడే రాగం. తిలక్ కామోద్ ఆరోహణలో ధ-దైవతం లేకుండా ఆరు

స్వరాలు, అవరోహణలో మొత్తం ఏడు స్వరాలు ఉపయోగిస్తారు. ఆరోహణలో వాడే కోమల్ 'ని' (నిషాదం) ప్రయోగం విషయంలో ఉత్తర భారతదేశంలోని  సంప్రదాయాల మధ్య ఏకాభిప్రాయం లేదు. ఆ 'ని' ఉపయోగిస్తేనే ఈ రాగం 'కాఫీ' థాట్ గా చెప్పాలి. లేకపోతే 'బిలావల్' థాట్ మూలాలు కలిగి ఉంటుంది. కానీ ఆ కోమల్ 'ని' ప్రయోగం వల్ల 'దేశ్' రాగంతో చాలా దగ్గరగా ఈ రాగం వినిపిస్తుంది. తిలక్ కామోద్ లోని ఎక్కువ పాటలు దేశ్ రాగంలో ఉన్నాయనుకుని వినడం జరుగుతుంది. హిందుస్తానీ సంప్రదాయం ప్రకారం రాత్రి రెండవ జాములో పాడవలసిన రాగం. కర్ణాటక సంగీతంలో శంకరాభరణం జన్యమైన 'నళినకాంతి' ఈ రాగాన్ని పోలియుంటుంది. చక్కని మానసిక ప్రశాంతతను ఇచ్చే ఆహ్లాదకరమైన వాతావరణం తిలక్ కామోద్ సృష్టిస్తుంది. హిందీ చిత్రాల్లో కొన్ని మంచి పాటలు ఈ రాగంలో ఉన్నాయి. తెలుగులో బహుస్వల్పం.

## 21.10.2022  అభేరి

కర్ణాటక రాగం అభేరికి భీమ్పలాస్ హిందుస్తానీలో  సమానరాగం. చాలా ప్రత్యేకతలు కలిగినవి ఈ జంట రాగాలు. కర్ణాటక, హిందుస్తానీ సంప్రదాయాలలో సమానమైన ఆదరణ కలిగియుండడం ఒక ప్రత్యేకత అయితే శాస్త్రీయ, చలనచిత్ర సంగీతాలు రెండింటిలోనూ ప్రముఖ స్థానంలో ఉండడం మరో ప్రత్యేకత.

అభేరి విషయానికి వస్తే ఒకే ఒక్క కీర్తనతో  విశేషమైన ఖ్యాతిని పొందిన రాగాల్లో ప్రస్తావించబడే రాగం. ఆ కీర్తన త్యాగరాజ స్వామి విశిష్ట రచన 'నగుమోము ఎనలేని నా జాలి తెలిసి...'. త్యాగరాజు అభేరి రాగంలో ఈ కీర్తన ఒక్కటి మాత్రమే వ్రాశారు.  శిష్యుడు తంజావూరు రామారావు (ఆయననందరూ చిన్న త్యాగరాజు అంటూ ఉండేవారు)  గురువుగారూ! ఈ రాగంలో మరొక కీర్తన వ్రాయండి అని అడిగితే త్యాగరాజు చిరునవ్వు నవ్వి అభేరి సంపూర్ణ స్వరూప ప్రదర్శనకు ఈ ఒక్క కీర్తన చాలు నాయనా అన్నారట. త్యాగరాజ స్వామి ఈకీర్తనలో అలనాడు గజేంద్రుని వేగంగా వచ్చి రక్షించిన సందర్భాన్ని గుర్తు చేస్తూ తనను కరుణించడంలో జాప్యం జరుగుతోందని నిష్ఠురంగా భగవంతుని ప్రశ్నిస్తున్నట్లు రచన సాగుతుంది.

కర్ణాటక సంగీతంలోని 20వ మేళకర్త “నటభైరవి” నుంచి జనించిన రాగం అభేరి.  కరుణ, భక్తి రసాలు ప్రధానంగా ఉన్న ఈ రాగంలో సృజనకి అవకాశం ఎక్కువ. ఔడవ సంపూర్ణ (5-7) స్వరాల రాగం. అంటే, ఆరోహణలో ఐదు స్వరాలు, అవరోహణలో ఏడు స్వరాలు ఉపయోగించే రాగం.  ఆరోహణలో రిషభ దైవత స్వరాలు వర్జితాలు.  పూర్వ సంగీత గ్రంథాల ప్రకారం, ఈ రాగం శుద్ధ దైవతం (హిందూస్తానీలో కోమల్దైవత్) తో పాడేవారట! రాను రాను చతుశ్రుతి దైవతం (హిందూస్తానీలో తీవ్ర దైవత్) ఉపయోగించటం వల్ల రాగం వినటానికి ఆహ్లాదంగా ఉండటం గుర్తించిన తరువాత, అభేరిలో చతుశ్రుతి దైవతం స్థిరపడి పోయింది.  ఈ నాడు ప్రచారంలో ఉన్న అభేరి రాగంలోని స్వరాల ప్రకారం, అభేరి 22వ

మేళకర్త అయిన "ఖరహర ప్రియ" కు జన్య రాగంలా అనిపిస్తుంది. అభేరి రాగంలోని ఈ మార్పు, కాలక్రమంలో రాగాలలో వచ్చిన మార్పులకి ఒక ఉదాహరణ. దీక్షితార్ అభేరి పేరుతో ఒక రచన చేసినా ఆ రాగం మన ప్రస్తుత అభేరిని పోలియుండదు.  ఆయన దేవగాంధారం గా వ్యవహరించి కీర్తనలు రచించిన 'కర్ణాటక దేవగాంధారి' మాత్రం అభేరిని పోలిన రాగం.

## 22.10.2022  కదనకుతూహలం

కొన్ని కీర్తనలు వింటుంటే ఆ కీర్తనలు రచించబడిన కాలం, అప్పటి సామాజిక జీవనం గురించి కూడా ఆలోచించే అవసరం ఏర్పడుతుంది. ముత్తుస్వామి దీక్షితార్ వెస్ట్రన్ ట్యూనులో స్వరపరిచినవీ, త్యాగరాజు స్వరపరిచిన 'రమించువారెవరురా' (సుపోషిణి రాగం), 'శరశర సమరైక శూర' (కుంతలవరాళి) వంటి కృతులూ వినడానికి వెస్ట్రన్ పాటల్లాగానే ఉంటాయి. వారి తరువాత తరం వాగ్గేయకారులు పట్నం సుబ్రహ్మణ్య అయ్యర్ కదనకుతూహల రాగరచన 'రఘువంశ సుధాంబుధిచంద్ర' ఈ కృతుల కంటె మరింత ఉత్సాహంగా ఆరోహణలో స్వరాలు ముందుకీ వెనక్కీ వెళుతూ నాట్యం చేస్తున్నట్లు ఉంటుంది. వీరందరినీ ప్రభావితం చేసినవి అప్పటికే విదేశీయుల ద్వారా మన దేశంలో ప్రవేశించిన పాశ్చాత్య సంగీత పోకడలు. సంగీత త్రిమూర్తుల కాలం 1762 - 1847. (ఆ తరువాత 10 సంవత్సరాలకే సిపాయిల తిరుగుబాటు దేశంలో జరిగింది కదా!) అప్పటికి వారు జీవించిన తంజావూరు ప్రాంతం మరాఠా రాజుల ఏలుబడిలో ఉన్నా వారు స్వతంత్రంగా పరిపాలన చేసే పరిస్థితులు లేవు. ఫ్రెంచివారు, బ్రిటిష్ వారి ఆధిపత్యపోరుకు ఆ రాజులు గురైనారు. ఏదో ఒక సైన్యానికి వారు ఆశ్రయం ఇవ్వవలసి వచ్చింది. ఆ మిలిటరీ బ్యాండ్ వారి పాశ్చాత్య వరుసలు మన సంగీతజ్ఞుల చెవిని పడి వారిని   ఆకట్టుకొని, ఆలోచింపచేసి ఉంటాయి.  ఏ ఇతర సంగీతాన్నైనా అర్థం చేసుకోగల శక్తి మన సంగీతం విద్వాంసులకు ఇచ్చింది కాబట్టి మన రాగాల్లోనే ఆ వరుసలు పలికించే ప్రయత్నం సఫలీకృతం కావడంవల్లనే అలాంటి కీర్తనలు ఉద్భవించాయి.

కదనకుతూహల రాగానికి ఈ పేరు పెట్టడానికి ఒక కథ చెబుతారు. సుబ్రమణ్యయ్యరు ఎక్కువ మధ్యమ కాలంలోనే పాడేవారు. అప్పట్లో వైద్యనాథయ్యరు కూడా మైసూరు ఆస్థానంలో కచేరీలు చేసేవారు. ఈయన అతివిలంబ కాలంలో ఎక్కువగా పాడేవారు. పాశ్చాత్య సంగీతాధారిత రచనలూ చేసారు. ఇందులో ఈయనకి పోటీ లేదని ఒకసారి మైసూరు మహారాజు అంటే, దానికి దీటుగా సుబ్రమణ్యయ్యరు ఒక ప్రత్యేకరాగంలో పాట కట్టి ఆశువుగా కచేరీలో పాడాడు. వైద్యనాథయ్యరు రచన కంటే ఇది మరింత రమ్యంగా ఉండి ఇది ఏ రాగమని ఎవరో అడిగితే, వైద్యనాథయ్యరుపై కదనరంగానికి వెళుతున్నట్లుందని ఇంకొకరు చమత్కరిస్తే, అది విని ఈ రాగం పేరు 'కదనకుతూహలం' అని

సుబ్రమణ్యయ్యరు చెప్పినట్లుగా ఒక కథ ప్రాచుర్యంలో ఉంది. నిజానికి శంకరాభరణ జన్యమే 'కుతూహలం' అని మరొక రాగం ఉంది.

పట్నం సుబ్రమణ్యయ్యరు పేరు చెప్పగానే ఎవరికైనా 'రఘువంశ సుధాంబుధి' కృతి చప్పున స్ఫురిస్తుంది. ఈ కృతి రాగం పేరు కదనకుతూహలమని పైన చెప్పుకున్నాం. ఈ రాగం నడకలో ఒక రకమైన ఊపూ, ఒంపూ ఉన్నాయి. అందువల్లే వాయిద్యకారుల సంగీతకచేరీల్లో  ఈ కృతి వాయించడానికి ఎంతో ఇష్టపడతారు.

పాశ్చాత్య సంగీతానికి అతి దగ్గరగా ఉండే రాగం శంకరాభరణం. కదనకుతూహలం శంకరాభరణ రాగ జన్యం. అందువల్ల ఈ రాగానికి ఒక ప్రత్యేకమైన లయ ఉంటుంది.  కదనకుతూహల రాగ ఆరోహణా/అవరోహణా స్వరాలు పరిశీలిస్తే ఆరోహణలో సప్తస్వరాల్లో గ,ప లేవు. ఒక్కో స్వరం ముందున్న స్వరాన్ని దాటుకుంటూ రెండో స్వరాన్ని చేరుతుంది. వక్ర సంచారం. ముందు స్వరాన్ని దాటుకుంటూ వెనక్కీ ముందుకీ రావడం వల్ల ఒక ప్రత్యేకమైన రిథమ్ లేదా లయతో కూడి అందం వస్తుంది. అవరోహణ మాత్రం శంకరాభరణ అవరోహణమే.  ఇలా స్వరాలు దాటుకుంటూ ముందు స్వరాలని చేరే పద్ధతి పాశ్చాత్య సంగీతంలోనూ కనిపిస్తుంది.

తమిళ సినిమాల్లో ఇలాంటి పోకడలు తక్కువే. ఎందుకంటే అక్కడ సంగీత విద్వాంసులు, శ్రోతల నుండి ప్రతిఘటన ఉంటుంది. 1985 లో నిర్మించిన 'సింధుభైరవి' చిత్రం కథాపరంగా సంగీత ప్రపంచంలో సంస్కరణలను ప్రోత్సాహించాలనే చిత్రం. అందులో త్యాగరాజస్వామి కాంభోజి రాగంలో రచించిన ఒక అరుదైన కీర్తన 'మరిమరి నిన్నే మొరలిడి...' ను రాగం మార్చి సారమతి రాగంలో సంగీత దర్శకుడు ఇళయరాజా జేసుదాస్ చేత పాడించారు. చిత్రం విడుదలయ్యాక శాస్త్రీయ సంగీత లోకం నుంచి తీవ్ర ఆక్షేపణలు వచ్చాయి. త్యాగరాజ కీర్తనలను రాగం మార్చి పాడడం జరుగదు. ఆ ప్రయత్నం ఎవరూ చెయ్యరు. ఇళయరాజా తాను జేసుదాస్ వంటి శాస్త్రీయ సంగీత విద్వాంసుని చేతే పాడించాను, ఆయన అభ్యంతరం చెప్పకపోవడంతో తానంత దోషంగా అనుకోలేదన్నాడు. జేసుదాస్ ఎటూ చెప్పలేదు. ఆయనలో శాస్త్రీయ సంగీత విద్వాంసుని కంటె సినిమా గాయకుడే ఆ సందర్భంలో ప్రజలకు కనబడ్డాడు.

త్యాగరాజ కీర్తనలలో పూర్వం నుంచీ ఒక కీర్తన ఒకటి కంటే ఎక్కువ రాగాల్లో పాడడం జరుగుతుంది. అది 'చేతులార శృంగారము..'. ఖరహరప్రియలో, భైరవిలో, అరుదుగా నటభైరవిలో పాడేవారని వినడమే. ఇప్పుడు ఎవరూ పాడడమే వినము. కానీ ఇప్పటికీ త్యాగరాజ ఆరాధన సమయంలో పంచరత్న కీర్తన గానానికి ముందు వేణుగాన విద్వాంసులు ఖరహరప్రియ రాగంలో పాడడం ఆనవాయితీగా వస్తోంది.

23.10.2022   దుర్గ

దుర్గ దక్షిణ భారత సంగీతం నుండి హిందుస్తానీ శాస్త్రీయ సంగీతంలోని తీసుకొని రాబడిన రాగం. చాలా ప్రజాదరణ పొందిన రాత్రి పూట పాడే మధురమైన రాగం. హిందుస్థానీ శాస్త్రీయ సంగీత శైలికి చక్కగా సరిపోతుంది. ఇది కర్ణాటక సంగీతంలోని శుద్ధ సావేరితో కొన్ని లక్షణాలను పోలియుంటుంది. కానీ రాగం యొక్క సంచారాల పరంగా కొంత భిన్నంగా ఉంటుంది. గాంధారం నిషాదం వర్జ్యమైన ఔడవ - ఔడవ (5-5) రాగం.బిలావల్ థాట్ కు చెందినది. ఖయాల్స్, బందిష్ లు చాలా చక్కగా కంపోజ్ చేస్తారు. శృంగారం, ప్రేమ. భక్తి సంగీతాలకు అనువైనది. పాడడానికి రాత్రి రెండవ జాము నిర్దేశిత సమయం. సంగీత విద్యాబోధనలో ప్రధానమైన రాగం. హిందుస్తానీ శాస్త్రీయ సంగీత ప్రదర్శనలలో ఎక్కువగా ఎంచుకోబడుతుంది. హిందీ చలన చిత్ర సంగీతం, భక్తి సంగీతాలు ఆధారపడే ముఖ్య రాగాలలో ఒకటి.

కళావతి అంటే కళలతో అలంకరించబడిన వ్యక్తిని సూచిస్తుంది. కాబట్టి జ్ఞాన స్వరూపిణియైన సరస్వతీ దేవిగా భావించవచ్చు. ఇది చాలా మధురమైన రాగం. రాగం యొక్క అందం దాని సరళతలోనే ఉంది, ఇది చెవులకు చాలా ఆహ్లాదకరంగా ఉంటుంది, వత్తిడి నుండి ఉపశమనం ఇస్తుంది.

## 24.10.2022 కళావతి

కళావతి రాగం కర్ణాటక సంగీతం నుండి గ్రహించిన ఒక ఆధునిక పెంటాటోనిక్ (5 స్వరాలు కలిగిన) హిందుస్థానీ శాస్త్రీయ రాగం. రి (రిషభం - హిందుస్తానీలో 'రే' అని పలుకుతారు), మ (మధ్యమం) వర్జ్య స్వరాలు. కళావతి ఖమాజ్ థాట్కు చెందినది. ఈ రాగం మహారాష్ట్రలో పండిట్రావ్ నాగర్కర్, రోషన్ అరా బేగం, గంగూబాయి హంగల్ వంటి విద్వాంసుల ద్వారా ప్రాచుర్యం పొందింది. కర్ణాటక సంగీతంలోని కళావతి రాగంతో సారూప్యత హిందుస్తానీ కళావతికి లేదు. కాని కర్ణాటక సంగీతంలో 'వలజి' రాగంతో పోలి ఉంటుంది. వలజి 28వ మేళకర్త హరికాంభోజికి చెందిన జన్యరాగం. జనసమ్మోహిని అనే రాగం కళావతికి సన్నిహిత రాగం.

మాధుర్య ప్రధానమైన రాగాలకు చలనచిత్ర సంగీతంలో ఎప్పుడూ ఆదరణ ఉంటుంది. అందువల్ల చాలా మంచి పాటలు కళావతి రాగంలో అటు దక్షిణ భారత చిత్రాల్లో వలజిలో శ్రోతలకు అందుబాటులో ఉన్నాయి.

## 26.10.2022 హరికాంభోజి

హరికాంభోజ రాగం కర్ణాటక సంగీతంలో ప్రసిద్ధి చెందిన పురాతన రాగాలలో ఒకటి . ఇది 28వ మేళకర్త రాగం. శుద్ధ మధ్యమ రాగం. హిందుస్తాని సంగీతంలో 'ఖమాజ్' థాట్ ఈ రాగంతో సమానం. ముత్తుస్వామి దీక్షితార్ విధానంలో దీనినిహరికేదారగౌళ ' అని పిలుస్తారని చెప్తారు. కాని ఆ రాగంలో కీర్తనలు ఏవీ దీక్షితార్ రచించినట్లు లేదు. వాచస్పతి హరికాంభోజికి సమానమైన ప్రతి

మధ్యమ రాగం. ఇది 64వ మేళకర్త. ఒక గంభీరమైన రాగం. వేగవంతమైన సంగతులు, కల్పన స్వరాలతో విస్తారమైన ప్రదర్శనకు ప్రసిద్ధి చెందింది.

తమిళ పురాతన సంస్కృతిలో వారి సంగీత విధానం ఒకటి ఉండేది. 'పణ్' (PANN) లనే పేర్లతో రాగాలను పిలిచేవారు. వారి పూర్వ గ్రంథాలలో వాటి ప్రస్తావన ఉంటుంది. శైవ మత రచనలు 'తేవారం' లు పాడడం బోధించడానికి హరికాంభోజి రాగం అనువుగా ఉండేది. ఆరోహణ అవరోహణంలో స్వరాల మధ్య విరామం సమానంగా ఉండి సంగీతంలో ప్రారంభ పాఠాలను బోధించడానికి ఈ రాగం బాగా ఉపయోగపడుతుంది. హరికాంభోజి రాగం తమిళ 'పణ్' యుగం తర్వాత ఉపేక్షకు గురైంది. వాస్తవానికి దాని పునరుజ్జీవనానికి ఈ రాగంలో ఎన్నో అద్భుతమైన కీర్తనలను స్వరపరిచిన త్యాగరాజుకు పూర్తిగా సంగీత లోకం ఋణపడి ఉంటుంది. కర్ణాటక సంగీత త్రిమూర్తులలో, త్యాగరాజు మాత్రమే హరికాంభోజిలో కీర్తనలు రచించారు. ఆయన ప్రసిద్ధ కృతులు 'రామ నన్ను బ్రోవ రావేమకో', 'ఎంత రాని తనకెంత పోని', 'నేనెందు వెదకుదురా', 'ఎందుకు నిర్దయ', 'ఉండేది రాముడొకడే', 'చని తోడితేవే', 'దినమణి వంశతిలక' వంటి అనేక రచనలను స్వరపరిచారు. వీటిలో ప్రతి ఒక్కటి రాగం యొక్క ఆత్మను వర్ణిస్తుంది. మనకు మరింత అదృష్టమేమిటంటే, చాలా మంది గొప్ప సంగీతకారులు ఒక్కొక్కరు ఒక్కో కీర్తనను తమదిగా చేసుకొని తనదైన ముద్ర వేశారు. ఈరోజుకూ ఎమ్మెస్ సుబ్బులక్ష్మి, పట్టమ్మాళ్, అరియకుడి, సెమ్మంగుడి వంటి విద్వాంసుల గళాలలో మనకు వినడానికి దొరుకుతున్నాయి.

హరికాంభోజి చాలా ముఖ్యమైన రాగమేకాక 70కి పైగా జన్యరాగాలున్న మేళకర్త రాగం. ఇన్ని రాగాలకు జనక రాగంగా ఉన్న విశిష్టత మరే రాగానికీ లేదు. ఆ రాగాలన్నీ ఎక్కువగా వాడబడుతున్నవే. ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన 'మోహన' రాగం వాటిలో ప్రముఖమైనది. హరికాంభోజి లక్షణాలు ఎక్కువగా కనబడే రాగం 'ఖమాస్' కాగా కచేరీలలో ప్రధాన రాగంగా ఎంచుకుంటే కచేరీ మొత్తాన్నే విజయవంతం చేయగల జన్యరాగం 'కాంభోజి'. సప్తస్వరాలు సంపూర్ణంగా ఉన్న మేళకర్తల కంటె కొన్ని స్వరాలు లుప్తమైన జన్యరాగాలు మరింత మాధుర్యభరితమైన సంగీతాన్ని ఇస్తూ జనాదరణకు పాత్రం కావడం శాస్త్రీయ సంగీత శ్రోతలను అనుభవం లోని విషయమే కదా!

సినిమా సంగీత విషయానికి వస్తే పూర్తి శాస్త్రీయంగా ఈరాగాన్ని వాడడం చూడం. కొద్ది మార్పులతో వాడి చేసిన పాటలు కూడా సినిమాలలో ముఖ్య సన్నివేశాలకు (యుగళ గీతాల వంటివి) వాడేవి కాకపోవడంతో జన బాహుళ్యం లోనికి ఈ రాగం పోలేదు. జన్యరాగాలన్నీ సినిమా సంగీతంలో వాడబడుతున్నవే.

## 27.10.2022 సుమనేశరంజని

ప్రతిమధ్యమ రాగాల యొక్క జన్య రాగాలను పరిశీలిస్తే, అవి తక్కువ సంఖ్యలో ఉంటాయి. వాటి సంబంధిత శుద్ధ మధ్యమ తుల్య రాగాల (equivalents) కంటే తక్కువ ప్రముఖమైనవి కూడా. అలాంటిదే 'సుమనేశరంజని' రాగం. 'సముద్రప్రియ' అని కూడా పిలుస్తారు. ఇది 56వ మేళకర్త 'షణ్ముఖప్రియ' యొక్క జన్యరాగం. రిషభ, ధైవతాలు కాక మిగిలిన 5 స్వరాలు కలిగియుంటుంది. ఔడవ - ఔడవ (5-5) సౌష్టవ రాగం. శుద్ధ ధన్యాసి రాగానికి ప్రతిమధ్యమ ప్రతిరూపం. ఈ రాగం అరుదైనది. కొన్ని రచనలు అందుబాటులో ఉన్నప్పటికీ, వీటిలో ఏవీ కచేరీలలో పెద్దగా పాడబడటం లేదు. అలాగే సంగీత త్రిమూర్తులు మరియు ప్రముఖ స్వరకర్తలు ఎవరూ ఈ రాగంలో స్వరపరచలేదు. కొన్ని పురందరదాస కృతులు ఉన్నా అవి తరువాత ఈ రాగానికి సెట్ చేసారు. హిందూస్థాని రాగం 'మధుకౌన్స్' అదే స్వరాలతో ఉండి సుమనేశరంజనికి సమానమైన రాగం. థాట్ కాఫీకి చెందుతుంది.

ఎందుకో సినీ సంగీత దర్శకులు ఇంత మధురమైన రాగంపై దృష్టి పెట్టలేదు. తెలుగులో 1963 లో బందిపోటు, వాల్మీకి చిత్రాల్లో ఘంటసాల గారే రెండు పాటలు చేశారు. బందిపోటులో 'ఊహలు గుసగుసలాడే...' ఇప్పటికీ శ్రోతలు అభిమానించే పాట.

## 28.10.2022 ముఖారి

ముఖారి రాగం 22వ మేళకర్త ఖరహరప్రియకు జన్య రాగం. గాంధారం ఆరోహణలో లేదు. మిగిలిన 6 స్వరాలు ఉంటాయి కాని వక్ర సంచారంతో ఉంటాయి. అవరోహణ సంపూర్ణం. ముఖారి రాగం తరచుగా దుఃఖకరమైన రాగం (శోక రస)గా చెప్పబడుతుంది. నవరసాల్లో శోకం లేదు. దానికి దగ్గరగా వచ్చేవి బీభత్సం, కరుణ. పూర్వకాలం మనదేశంలో వీధినాటకం, యక్షగానం లాంటి కళారూపాలుండేవి. విషాదమైన ఘట్టం వచ్చినప్పుడల్లా ముఖారి రాగమే వాడగా వాడగా, జనాల మనసులో ముఖారి అంటే విషాదం, శోకం అనే భావన వచ్చేసి ఉంటుంది. కానీ వాస్తవానికి ఇది భక్తి రసాన్ని, శాంత రసాన్ని కూడా ప్రభావవంతంగా వెదజల్లుతుంది. భావోద్వేగం ప్రస్ఫుటం చేసే రాగం, చాలా బాధాకరంగా మరియు ఆత్మపరిశీలనగా ఉంటుంది. వాస్తవానికి ఆర్ద్రమైన భక్తికి ఇంతకంటే సరియైన రాగం లేదు. అందుకే త్యాగరాజ స్వామి అన్ని రచనలు చేశారు. (ఎంతని నే వర్ణింతును శబరీ భాగ్యము, తలచినంతనే నా తనువైతే, సంగీత శాస్త్ర జ్ఞానము, క్షీణమై తిరుగ, ఇందుకా ఈ తనువు పెంచినది, ఎంతని నే వర్ణింతును శబరీ భాగ్యము, ఏల అవతారమెత్తుకొంటివో, కారుబారు సేయువారు గలరే, చింతిస్తున్నాడే యముడు). ఇది చాలా విలంబ కాలంలో ఉత్తమంగా అనిపిస్తుంది. ప్రతి నోట్ మరియు గమకం స్పష్టంగా ఉచ్ఛరిస్తారు. ఈ రాగం మనోధర్మ సంగీతానికి మంచి అవకాశం ఇస్తుంది. ముఖారి యొక్క సన్నిహిత రాగాలలో హుసేని, భైరవి, సాలగభైరవి, కోకిలవరాలి, మాంజి వంటివి ఉన్నాయి. హిందుస్తానీ సంగీతంలో ముఖారిని పోలిన రాగం లేదు. బసంత్ ముఖారి అనే ఒక రాగం ఉంది కాని అది కర్ణాటక రాగం వకులాభరణం యొక్క హిందుస్థానీ అనుసరణగా విస్తృతంగా గుర్తించబడింది. ఈ రాగంలో చాలా మందికి తెలిసినది అన్నమయ్య కీర్తన "బ్రహ్మ కడిగిన పాదము". ఎవరు పాడినది విన్నా ఒక పరమాద్భుతమైన దివ్యదృశ్యాన్ని చూస్తున్న అనుభూతి కలుగుతుందే గాని విషాదమన్నది ఏ కోశానా కనబడదు.

ఈ రాగాన్ని కచేరీలో ముఖ్యాంశంగా పాడరు. కాని శ్రోతల అవగాహనా సామర్థ్యంపై నమ్మకం కలిగితే విద్వాంసులు ముఖారిని విస్తారంగా ప్రదర్శించి కృతకృత్యులైన సందర్భాలు అనేకం. చలన చిత్రాలలో ఎక్కువ వాడుకలో లేదు. పౌరాణిక చిత్రాలలో ఎక్కడైనా పద్యానికి వాడేవారు. ఇంత కరుణ రసాత్మకమైన రాగంలో పాటలు హాస్య సన్నివేశాలకు రూపొందడం కూడా చూస్తాం. సత్య హరిశ్చంద్ర చిత్రంలో నక్షత్రక పాత్రకు, రాముడు భీముడు చిత్రంలోనూ అలాంటి పాటలు వినగలం.

## 29.10.2022 వకుళాభరణం

సరళిస్వరాలు మరియు అనేకమైన జనాదరణ పొందిన కృతుల ద్వారా కర్ణాటక సంగీతం గురించి తెలిసిన ప్రతి ఒక్కరికి మాయామాళవగౌళ రాగం తెలుసు. ఈ రాగం హిందుస్తానీ సంగీతంలో రాగ్ భైరవ్ గా కూడా ప్రసిద్ధి చెందింది. కానీ 72 మేళకర్త రాగ విధానంలో మాయామాళవగౌళ (15) కు ముందు స్థానం (14)గా ఉండే రాగం వకుళాభరణం గురించి అంతగా తెలియదు. వకుళాభరణంది హరికాంభోజి, నఠభైరవి వంటి మేళకర్త రాగాల పరిస్థితే. ఈ రాగాల ప్రాముఖ్యం వాటి 'జన్య రాగాలు' పొందే అంతులేని జనాదరణ వల్ల తగ్గింది. హరికాంభోజి యొక్క ప్రసిద్ధ జన్యాలు చాలా మనకు తెలుసు. నఠభైరవి విషయంలో భైరవి, ఆనందభైరవి. ఖచ్చితంగా తాము పొందిన జనాదరణలో వసంతభైరవి, ఆహిరి, రేవతి రాగాలు మాతృరాగం వకుళాభరణం కంటే మెరుగైన స్థితిని పొందడంలో విజయం సాధించాయి!

వకుళాభరణంలో నిషాదంలో మార్పు తప్ప అన్నీ మాయామాళవగౌళ స్వరాలే ఉంటాయి. మాయామాళవగౌళ కాకాళి నిషాదం (హిందుస్తానీ సంగీతంలో N3 లేదా శుద్ధ నిషాద్) కలిగి ఉండగా, వకుళాభరణంలో కైసికి నిషాదం (N2 లేదా కోమల్ నిషాద్)ని తీసుకుంటుంది. మాయామాళవగౌళతో పోల్చినప్పుడు నిషాదం యొక్క ఒక స్వరంలో ఈ వ్యత్యాసం వకుళాభరణం స్వరూపాన్ని తీవ్రంగా మారుస్తుంది, ఆ రాగానికి దాని ప్రత్యేక లక్షణం, గుర్తింపును ఇస్తుంది. మాయామాళవగౌళ చాలా విస్తృతమైన ఆలాపనలకు అవకాశం కల్పిస్తుంది. అంత విస్తృతం కానప్పటికీ, వకుళాభరణం కూడా అందమైన రాగాలాపనకు అనుకూలిస్తుంది. దీనికి ప్రధాన కారణం కారణం కైశికి నిషాద స్వరం యొక్క ప్రభావం వల్ల కలిగిన ఒక జాలి కలిగించే లక్షణము. ఈ స్వరం ఇతర మాయామాళవగౌళ స్వరాలతో మిళితం అయినప్పుడు ఉత్పత్తియే సంగీతం నిజంగా మెలన్కోలి స్పర్శతో అందంగా ఉంటుంది. వకుళాభరణం యొక్క గంభీరమైన ప్రదర్శనను వింటే ఎవరైనా కదిలిపోతారు కరిగిపోతారు. దాదాపుగా వినేవారిపై ఉత్కంఠ ప్రభావం చూపుతుంది. ఈ ఒక్క కారణం వల్లనే, వకుళాభరణం పూర్తిగా ప్రత్యేక స్థానానికి అర్హమైనది. కర్ణాటక సంగీతం నిజంగా గర్వించదగిన అద్భుతమైన రాగం. త్యాగరాజు వకుళాభరణం యొక్క సామర్థ్యాన్ని సరిగా గ్రహించారని ఆయన ఆ రాగంలో రచించిన ఏకైక కీర్తన 'ఏ రాముని నమ్మితినో' పరిశీలిస్తే అవగతమౌతుంది.

బసంత్ ముఖారి కర్ణాటక రాగం వకుళాభరణం యొక్క హిందుస్థానీ అనుసరణగా విస్తృతంగా గుర్తించబడింది. ఈ హిందుస్థానీ రూపం, లక్నోలోని మారిస్ కాలేజ్ ఆఫ్ మ్యూజిక్ వ్యవస్థాపక ప్రిన్సిపాల్ ఆచార్య S N రతంజంకర్ యొక్క పరిశీలనాత్మక కృషి వల్ల స్థిరపడింది. నిజానికి కర్ణాటక సంప్రదాయం నుండి వకుళాభరణం హిందూస్థానీ సంప్రదాయంలోనికి దిగుమతికి పూర్వం ఈ రాగం పర్షియన్ మూలానికి చెందిన మెలోడీ 'హిజాజ్' అనే ఒక పరిణతి చెందిన రాగంగా 1930లలో V N బాత్ఖండేచే డాక్యుమెంట్ చేయబడింది. హిజాజ్ ఎప్పుడు హిందుస్తానీ సంగీతంలోకి ప్రవేశించిందో తెలియదు. బసంత్ ముఖారి యొక్క స్వర నిర్మాణం హిజాజ్కు దగ్గరగా ఉంటుంది. చిన్న అంశాలలో మాత్రమే బిన్నంగా ఉంటుంది. 1950 దశకంలో పెర్షియన్ మూలం యొక్క వినియోగం దాదాపు అంతరించిపోయింది. గొప్ప పండితుడు మరియు బాత్ఖండే శిష్యుడైన రతంజంకర్ 'బసంత్ ముఖారీ - హిజాజ్ - వకుళాభరణం' సంబంధం ఖచ్చితంగా తెలుసు. ఆయనే దానికి కొత్త పేరు పెట్టాడు - బసంత్ ముఖారిగా.